గురుతరం

- మార్కులతో డీఎస్సీ ఫలితాలు విడుదల
- అర్హులైన అభ్యర్థుల ఫోన్‌లకు మెసేజ్‌లు
- ఉమ్మడి జిల్లాలో భర్తీ కానున్న 807 టీచర్ పోస్టులు

అనంతపురం విద్య, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ మెరిట్ లిస్టు వచ్చేసింది. రాష్ట్ర విద్యాశాఖ శుక్రవారం రాత్రి అధికారికంగా విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 807టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో ఎస్జీటీ పోస్టులు 147, ఎస్జీటీ కన్నడ 07, ఎస్జీటీ ఉర్దూ 48 పోస్టులు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్లలో తెలుగు 28, ఉర్దూ 9, హిందీ 28, ఇంగ్లిష్ 103, గణితం 43, ఫిజికల్ సైన్స్ 66, బయాలజికల్ సైన్స్ 72, సోషియల్ 110, సోషియల్ ఉర్దూ 1, ఫిజికల్ డైరెక్టర్లు(పీడీ)145 ఉన్నాయి. ఈ పోస్టులకు 45,186 మంది పరీక్షలు రాశారు. ప్రస్తుతం డీఎస్సీ మెరిట్ లిస్టు విడుదల చేయడంతో ఎవరు ఏ సబ్జెక్టులో టాపరో, ఎన్ని మార్కులు వచ్చాయో తెలిసిపోయింది. అలాగే అభ్యర్థులు కటాఫ్ ఎంతకు ఉంటుందనే విషయంలో లెక్కలు వేసుకుంటున్నారు.

రేపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

మెరిట్, రోస్టర్ ఆధారంగా టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ఫోన్‌లకు రాష్ట్ర విద్యాశాఖ (మిగతా 4వ పేజీలో....)

తొలి రెండు ర్యాంకులు ధర్మవరానికే..



దివ్యశ్రీకి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

ధర్మవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఎస్జీటీ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా టాపర్లు ధర్మవరం విద్యార్థులు నిలిచారు. పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన చేనేత కార్మికులు చింతా పరమేశ్వర్, పద్మావతి దంపతుల కుమార్తె దివ్యశ్రీ 92.79 మార్కులు సాధించి మొదటి ర్యాంకులో నిలిచింది. దీంతో తల్లిదండ్రులు ఆమెకు స్వీట్లు తినిపించి సంబరాలు చేసుకున్నారు. ఈమె అనంతపురంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో డీఎస్సీకి శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు.



సాయికుమార్

- ధర్మవరంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన ఉక్కిసాల సంగప్ప, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు సాయికుమార్ డీఎస్సీ ఎస్జీటీ పరీక్షల్లో 92.70 మార్కులు సాధించి ఉమ్మడి జిల్లాలో రెండో ర్యాంకు సాధించాడు. దీంతో ఆ ఇంట్లో సంబరాలు జరుపుకున్నారు. డీఎస్సీ ఎస్జీటీ ఫలితాల్లో జిల్లా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు ఇద్దరూ చేనేత కుటుంబానికి చెందిన వారే కావడం గమనార్హం.

అక్కా ఫ్రీ బస్సు బాగుందా..?

మహిళలను అడిగిన మంత్రి సత్యకుమార్



ఆర్టీసీ బస్సులో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అక్కా ఫ్రీ బస్సు ప్రయాణం ఎలా ఉంది ? అంతా బానే ఉంది కదా..! అంటూ ఆర్టీసీ బస్సులో మహిళా ప్రయాణికులతో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణసౌకర్యం మహిళల జీవితాల్లో కొత్తవెలుగులు నింపుతోందన్నారు. ఆయన శనివారం ఉదయం ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లి స్త్రీశక్తి పథకం ద్వారా ప్రయాణిస్తున్న మహిళలు, పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థినులతో మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంపై పలువురు ఆయన వద్ద తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. తర్వాత బస్టాండ్ పరిసర ప్రాంతాలలో జరుగుతున్న పారిశుధ్య పనులను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేసు, పట్టణ అధ్యక్షుడు జింకాచంద్ర, రూరల్ అధ్యక్షుడు గొట్లూరు చంద్ర, జిల్లా కార్యదర్శి డోలా రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవసరమైన ఎరువులు సిద్ధం

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు సరిపడా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు శనివారం ఓప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,19,950 హెక్టార్ల సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటివరకు 79,686 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో వేరుశనగ, కంది, మొక్కజొన్న, పత్తి, ఆముదం, వరి పంటలు సాగులో ఉన్నట్లు తెలిపారు. యరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ ఎరువులు మొత్తం 20154 టన్నులు అవసరం కాగా యూరియా 2968 టన్నులు, డీఏపీ 1001 టన్నులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 12600 టన్నుల యూరియా, 4908 టన్నులు డీఏపీ ఎరువులు వినియోగించారని తెలిపారు. ఎరువులను అక్రమంగా దారి మళ్లిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆదర్శం.. ఆంధ్రకేసరి జీవితం : కలెక్టర్



ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతు లు నిరాండంబర జీవన విధానం అందరికీ ఆదర్శప్రా యమని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళుల ర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా, సంఘ సంస్కర్తగా , స్వాతంత్ర్య సమరయోధుడిగా బ్రిటిషువారితో పోరాడారన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి ఉన్నత చదువులు చదివి ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. ఆయన ఎంత ఉన్నతస్థాయికి ఎదిగినా తన నిరాండంబర జీవన విధానంతో ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కలెక్టరేట్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ నివాళి..



ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్పీ వీ.రత్న

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ఆదర్శప్రాయమని ఎస్పీ రత్న కొనియాడారు. టంగుటూరి జయంతిని పురస్కరించుకుని శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, న్యాయవాదిగా, రాజకీయవేత్తగా, రచయితగా రాణించిన విశేష ప్రతిభాశాలి టంగుటూరి అని ఎస్పీ అన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయ ఏఓ సుజాత, డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు వలి, మహేష్, రవికుమార్, సూపరింటెండెంట్ సరస్వతి సిబ్బంది పాల్గొన్నారు.

అందరూ వినండహో..! 4

అయ్యో.. వెంకటీ..!

యాడికిలో వెంకట్ ఫర్టిలైజర్స్ గోడౌన్ సీజ్

విత్తనాలు, పురుగు మందుల విలువ రూ.1.10కోట్లు

జిల్లాలో ఎరువుల గోదాముల్లో అధికారుల తనిఖీలు



అనుమతుల లేకుండా పెద్దఎత్తున నిల్వ ఉంచిన విత్తనాలు, మందులు

యాడికి/ అనంతపురం అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో వెంకట్ ఫర్టిలైజర్స్‌కు సంబంధించిన గోడౌన్‌పై వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రయ అనుమతులు లేని రూ.1.10కోట్ల విలువజేసే పత్తి, మొక్కజొన్న విత్తనాలు, పురుగు మందులను సీజ్ చేశారు. ఏఓ మహబూబ్‌బాషా తెలిపిన మేరకు వెంకట్ ఫర్టిలైజర్స్ గోడౌన్‌లో విక్రయ అనుమతి లేని రూ.90లక్షలు విలువజేసే పత్తి, మొక్కజొన్న విత్తనాలను గుర్తించినట్లు తెలిపారు. అనుమతి లేని గోడౌన్‌లో నిల్వ ఉంచిన రూ.20లక్షలు విలువజేసే పురుగుల మందులను గుర్తించినట్లు తెలిపారు. సంబంధిత దుకాణదారుడికి విత్తన విక్రయాలకు సంబంధించి జూన్ నెలలోనే గడువు ముగిసినట్లు తెలిపారు. విత్తనాలు, పురుగుల మందులను ఒకే గోడౌన్‌లో నిల్వ ఉంచడం వలన విత్తనాల జర్మినేషన్ శాతం పూర్తిగా తగ్గిపోతుందన్నారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు విక్రయించడం, అనుమతిలేని గోడౌన్‌లో నిల్వ ఉంచడం చట్ట విరుద్ధమని తెలిపారు. తనిఖీల్లో వీఆర్ఓ దామోదర్‌నాయుడు, వీఏఏ రమేష్, ఎంపీఈఓ రమేష్ పాల్గొన్నారు.

మూడు గోదాముల్లో

జిల్లాలోని మూడు ఎరువుల గోదాముల్లో విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ జిల్లా ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్, డీఎస్పీ నాగభూషణం తమ సిబ్బంది, వ్యవసాయ అధికారులతో కలిసి అనంతపురం నగర శివారు తపోవనంలోని సిరిగుప్ప గోదాము, గుత్తి రోడ్డులోని సుబ్రహ్మణ్యేశ్వర గోదాము, రాప్తాడు మండలం అయ్యవారిపల్లి వద్ద అవేజ్ గోదాములను తనిఖీ చేశారు. అవేజ్ గోదాములో ఏపీ మార్క్‌ఫెడ్‌కు సంబంధించిన 1600 మెట్రిక్ టన్నుల యూరియాను (మిగతా 4వ పేజీలో...)

చవితి ఉత్సవాలకు పటిష్ట భద్రత

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి

నేర సమీక్షలో ఎస్పీ రత్న



కేసుల ఛేదనలో అత్యుత్తమ ప్రతిభ చూపిన పోలీసు సిబ్బందికి పురస్కారాలు అందజేస్తున్న జిల్లా ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని ఎస్పీ రత్న ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నేర సమీక్ష నిర్వహించారు. నేర పరిశోధనలో, న్యాయ ప్రక్రియలో ఎలక్ట్రానిక్ పరికరాలు, డిజిటల్ రికార్డులు, ఆన్‌లైన్ డేటా పక్కాగా ఉండాలని, నేరస్థులకు శిక్ష పడేలా చూడాలని ఆదేశించారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సింగిల్ విండో విధానంఓ అనుమతులు పొందేలా ఉత్సవ కమిటీలకు సూచనలు ఇవ్వాలని అన్నారు. పాత నేరస్థులను బైండోవర్ చేయాలని ఆదేశించారు. పెద్ద విగ్రహాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలని అన్నారు. మిస్సింగ్, పోక్సో, మహిళలపై జరిగే నేరాల కేసులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ కేసులలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, శివన్నారాయణస్వామి, నరసింగప్ప, మహేష్, హేమంత్‌కుమార్, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, ఐటీ కోర్ ఇన్‌చార్జి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుచిత పోస్టులపై చర్యలు తీసుకోండి

ఎస్పీకి బీసీ ఐక్యవేదిక ఫిర్యాదు



ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న కాపునాడు, రాయలసీమ బీసీ ఐక్య వేదిక నాయకులు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యంంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాపునాడు అధ్యక్షుడు, రాయలసీమ బీసీ ఐక్యవేదిక నాయకులు కొట్టాల శ్రీరాములు, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్పీ రత్నకు శనివారం ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. అయినా కొంతమంది వైసీపీ నాయకులు పనికట్టుకుని అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుక్కపట్నం మండలం నార్పింపల్లికి చెందిన రమేష్‌కు రెండు చేతులున్నాయని, అయినా తాను దివ్యాంగుడనని, పింఛన్ తీసేశారని అసత్య ప్రచారం చేశాడని అన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరామని అన్నారు. సింగిల్ విండో డైరక్టరు అంజనేయులు, జైచంద్రారెడ్డి, తెలుగుయువత నాయకులు పవన్, శేఖర్‌రెడ్డి, తదితరులు వినతి పత్రం ఇచ్చినవారిలో ఉన్నారు.

అసత్య ప్రచారం చేస్తే చర్యలు: ఎమ్మెల్యే



బుక్కపట్నం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తూ, ప్రజలలో అలజడి సృష్టిస్తే చట్టప్రకారం తీవ్ర చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి హెచ్చరించారు. నార్పింపల్లికి చెందిన వైసీపీ మద్దతుదారుడు రమేష్ ఫేక్ వీడియోల ద్వారా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. అతనికి రెండు చేతులు, రెండు కాళ్లు సక్రమంగా ఉన్నాయని, అయినా అవిటితనం ఉన్నట్లు నటించాడని అన్నారు. గతంలో సీఎం, డిప్యూటీ సీఎంను దూషిస్తూ వీడియోలు పోస్టు చేశాడని అన్నారు. అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

తొలగిన వైసీపీ ముసుగు

పింఛన్‌లపై ఫేక్ ప్రచారం వెనుక వైసీపీ హస్తం ఉందని స్పష్టమైంది. బుక్కపట్నం పోలీసుల అదుపు లో ఉన్న రమేష్‌ను కలిసేందుకు ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి సహా పలువురు వైసీపీ నాయకులు శనివారం వెళ్లారు. పోలీసులు వారిని అనుమతించలేదు. దీంతో వెనుదిరిగారు.

స్వచ్ఛజిల్లాగా తీర్చిదిద్దుదాం : కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాను స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒకరు కృషి చేయాలని కలెక్టర్ చేతన్ పిలుపునిచ్చారు. పుట్టపర్తి మున్సిపాలిటీ అధ్వర్యంలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. హనుమాన్ సర్కిల్ వద్ద కలెక్టర్ జెండా ఊపి స్వచ్ఛాంధ్ర ర్యాలీని ప్రారంభించారు. మున్సిపల్ కార్యాయం మీదుగా చిత్రావతి సర్కిల్‌వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి, ప్రతి ఒకరు పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్, పశుసంవర్ధక జేడీ శుభదాస్, సాంఘిక సంక్షేమ డీడీ బాలాజీ, గిరిజ సంక్షేమశాఖ మోహన్‌రావు, తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి తదితరులున్నారు.

అయ్యో.. వెంకటీ..!

(3వ పేజీ తరువాయి)

పరిశీలించారు. సిరిగుప్ప, సుబ్రహ్మణ్యేశ్వర గోదాముల్లో యూరియా స్టాక్ లేనట్లు గుర్తించారు. ఆయా గోదాముల నుంచి ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఎంత మోతాదులో యూరియా సరఫరా అయ్యింది..? తదితర అంశాలపై ఎస్పీ ఆరా తీశారు. అనంతపురం పాతూరులోని శ్రీనివాస ఫర్టిలైజర్స్ షాపులో రూ.17560లు విలువైన 22 లీటర్ల నిషేధిత గడ్డి మందును గుర్తించి, సీజ్ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణం పరిగి రోడ్డులోని శ్రీ బాలాజీ ట్రేడర్స్‌లో 9.09 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు, రికార్డుల్లో వ్యత్యాసాన్ని గుర్తించి, తదుపరిచర్యలకు సిఫార్సు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ జమాల్ బాషా, విజిలెన్స్ ఏఓ వాసుప్రకాష్, ఎస్ఐ నరేంద్రభూపతి, డీసీటీఓ సురేష్‌కుమార్, హిందూపురం ఏడీఏ క్రిష్ణయ్య, అనంతపురం ఏఓ వెంకటేకుమార్, ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రూ.46.8 లక్షల మందులు సీజ్

అనుమతులు లేని క్రిమిసంహారక మందులను వ్యవసాయ అధికారులు శనివారం సీజ్ చేశారు. సమాచారం మేరకు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, అనంతపురం ఏఓ వెంకటేకుమార్ నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీ సంజీవరాయ ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు చేపట్టారు. నాగపూర్‌లోని మహేష్ ట్రేడర్స్ నుంచి తెప్పించిన అనుమతులు లేని క్రిమిసంహారక మందులను గుర్తించారు. ఈ నేపథ్యంలో రూ.రూ.46.8 లక్షల విలువైన 117 బాక్సుల్లోని 2340 బాటిళ్లను (500 ఎంఎల్) సీజ్ చేశారు. అలాగే వన్‌టౌన్ పోలీసులకు వ్యవసాయ అధికారులు ఫిర్యాదు చేశారు.



అనంతపురంలోని ఎరువుల గోదాములో యూరియా సరఫరాపై వివరాలు ఆరా తీస్తున్న విజిలెన్స్ ఎస్పీ ప్రసాద్

అందరూ వినండహో..!

- ప్రజలకు సమాచారాన్ని చేరవేసిన తప్పెట
- సాంకేతిక విప్లవంతో కనుమరుగైన సంప్రదాయం

'గ్రామ పెజానికం యావన్నదికి తెలియజేయడమేమనగా.. రేపట్నుంచి మన ఊరి స్టోరులో బియ్యం, చక్కెర, కందిపప్పు, కిరసనాయిల్ వేస్తారంట. కావున రేషన్ కార్డులున్న వారంతా వచ్చి సరుకులు తీసుకెళ్లాలని మనూరి డీలర్... తెలియచేశాడహో'...!

'గ్రామ మహాజనులారా..! రేపు మనూరికి తాసీల్దారు సారు వారు వస్తున్నారు. ఎవరికైనా భూముల సమస్యలు, పట్టాపాసు బుక్కుల సమస్యలుంటే రేపొద్దున్న 10 గంటలకు పంచాయతీ ఆఫీసుకు వచ్చి అర్జీలు ఇచ్చుకోవాలని మనూరి వీఆర్వో చెప్పినాడండహో'.. అంటూ గతంలో పల్లెల్లో దండోరా(చాటింపు) వేసేవారు. అయితే మారిన కాలమాన పరిస్థితుల్లో దండోరా మాయమైంది.

దండోరా మాయమైపోయింది



ఆదివారం ప్రత్యేకం

బొమ్మనహాళ్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల కిందట గ్రామంలో అందరికి సమాచారం తెలియాలంటే దండోరా వేయాల్సిందే. ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలకు సంబంధించి దండోరా ద్వారానే గ్రామస్థులకు సమాచారం చేరవేసేవారు. గ్రామానికి అధికారులు వస్తున్నా, రేషన్ షాపులకు నిత్యవసరా సరుకులు వచ్చిన తుఫాన్, అంటు వ్యాధులు వంటి ప్రతికూల పరిస్థితులు ఏర్పడినా ఇంటి పన్నులు, భూమి శిస్తు, కరెంట్ బిల్లులు చెల్లించాల్సిన వచ్చినా, గ్రామంలో ఏవైనా సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంలోనైనా దండోరా ద్వారానే ప్రజలకు తెలిపేవారు. ఇందుకోసం ఓ వ్యక్తి ప్రత్యేకంగా ఉండేవాడు. అయితే పెరిగిన సాంకేతిక విప్లవంతో దండోరా వేయడం కాలగర్భంలో కలిసిపోయింది.


ఇంటిపేరే దండోరా..

గ్రామాల్లో దండోరా వేసేవాళ్లకు అదే ఇంటిపేరుగా మారిపోయింది. ఈ క్రమంలో వ్యక్తి పేరుకు ముందు దండోరాను తగిలించి గ్రామస్థులు పిలిచేవారు. ఒక వ్యక్తి తప్పెట కొడుతూ, ఊరంతా తిరుగుతూ, ప్రతి వీధిలో బిగ్గరగా, గంభీర వైన స్వరంతో సమాచారాన్ని వినిపించేవాడు. ఇలా చేయడంతో చదువురాని వారికి సైతం ఆ సమాచారం సులభంగా అర్థం అయ్యేది. ఇప్పటికి మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో దండోరా వినపడుతోంది. తప్పెట కొట్టి మైకు ద్వారా సమాచారం చేరవేస్తున్నారు. అయితే చాలా ప్రాంతాల్లో దండోరా వేయడం అంతరించిపోవడంతో వాటిపై ఆధారపడిన కుటుంబాలు కూడా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల వైపు మళ్లాయి.

దండోరా వేస్తేనే అధికారిక సమాచారం

ఆ రోజుల్లో పల్లెల్లో ప్రభుత్వం పరంగా ఏ సమాచారం తెలియజేయాలన్నా దండోరా వేసేవారు. అలా చెప్తేనే మా అందరికి అధికారికంగా చెప్పినట్లు ఉండేది. తప్పెట ద్వారా దండోరా వేసే వ్యక్తులు రోడ్లపై వస్తే మేమంతా ఇంట్లో నుంచి బయటకు వచ్చి శ్రద్ధగా వినేవాళ్లం. ఇప్పుడు ఏమి వచ్చిందో తెలియడం లేదు. వాట్సాప్‌లో పంపించామంటారు.అదేంటో మాలాంటి వాళ్లకు తెలియదు.

- లోకనాథ్‌రెడ్డి, శ్రీధరఘట్ట



అంతా ఫోన్లలోనే చూసుకుంటున్నాం

ప్రస్తుతం ఏ సమాచారమైనా సెల్‌ఫోన్‌లోనే చూసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు సమాచారం వాట్సాప్‌లో వచ్చేస్తుంది. గ్రామ సమాచారం కూడా అందులోనే ఉంటుంది. దండోరా ద్వారా తెలుసుకుని వెళ్లేది చాలా తక్కువ. ఫోన్లో చూసుకున్న తర్వాత ఓహో ఇదేనా దండోరా వేసింది అనుకుంటూ ఉంటాం.

- శివరాజ్, ఉప్పరహాళ్



ఇప్పటికి దండోరా కొట్టిస్తాం

గ్రామాల్లో ఏ సమాచారం ప్రజలకు తెలపాలన్న ముందుగా దండోరా వేయిస్తాం. ప్రజలకు తెలిసేలా వీధి వీధినా దండోరా వేయిస్తూ ప్రభుత్వ సమాచారం తెలుపుతున్నాం పై అధికారులు కూడా గ్రామాల్లో చాటింపు వేయించారా అని అడుగుతారు. వీఆర్ఏలు ముందుండి దండోరా వేసి అది వీడియో తీసి గ్రామ వాట్సాప్ గ్రూపులో పంపిస్తున్నారు.

- శివన్న, పంచాయతీ కార్యదర్శి ఉద్దేహాళ్





40 ఏళ్ల నుంచి దండోరా వేస్తున్నా

దాదాపు 40 ఏళ్ల నుంచి నేనే గ్రామంలో దండోరా వేస్తున్నా. దండోరా వేయిస్తే ఊర్లో రైతులు ఒక్కసారికి రూ. 100 ఇస్తున్నారు. వీఆర్వో, పంచాయతీ సెక్రటరీ చెప్పిందే దండోరా వేస్తున్నా. ప్రభుత్వం నుంచి వచ్చిన ఏ సమాచారమైనా ఇప్పటికీ గ్రామంలో నేనే తప్పెట కొట్టి చెబుతున్నా. అయితే నాకు ఎలాంటి గవర్నమెంట్ జీతం ఇవ్వడం లేదు. నెల నెలా వృద్ధాప్య పింఛన్ మాత్రం రూ.నాలుగు వేలు ఇస్తున్నారు. ప్రభుత్వం గుర్తించి నెలకు ఎంతో కొంత వేతనం ఇవ్వాలి.

- హనుమంతప్ప, ఉద్దేహాళ్ గ్రామం

గురుతరం

(3వ పేజీ తరువాయి)

సమాచారం పంపింది. ఈ సమాచారం వచ్చిన అభ్యర్థులందరికీ సోమవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టనున్నారు. ఇందుకు జిల్లా విద్యాశాఖ నగరంలోని ఆలమూరు రోడ్డు నందు గల పీవీకేకే ఎంబీఏ కళాశాలలో ఏర్పాట్లు చేసింది. సర్టిఫికెట్ల పరిశీలనకు 16 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ముగ్గురు సభ్యులు ఉంటారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చే అభ్యర్థులు, వారివెంట వచ్చే పేరెంట్స్ కోసం 32 గదుల్లో వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

నిరుపేదను వరించిన టీచర్ పోస్టు



రొద్దం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొప్పాల గ్రామానికి చెందిన నిరుపేద మాల సోమశేఖర్‌ను టీచర్ పోస్టు వరించింది. పి.రొప్పాల గ్రామానికి చెందిన గౌరమ్మ, లక్ష్మణ్ణ దంపతుల నాలుగో కుమారుడు సోమశేఖర్ కూలి పని చేసుకుంటూ టీచర్ పోస్టు సాధించాడు. 20ఏళ్ల కిందటే తండ్రి చనిపోగా తల్లి గౌరమ్మ కూలి పని చేసుకుంటూ పిల్లలకు చదువు చెప్పించింది. సోమశేఖర్ సైతం తల్లికి చేదోడు వాదోడుగా ఉంటూ కూలి పనులకు వెళ్తూ చదువుకున్నాడు. దానికి ఫలితంగా శుక్రవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్‌లో 73.97మార్కులతో 70వ ర్యాంక్‌తో సాధించాడు. తల్లి 20ఏళ్ల కృషి ఫలించడంతో వారి ఆనందానికి వధులు లేకుండా పోయాయి.

ఇట్టే సత్తా చాటిన మోహన్‌బాబు



శింగనమల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ- 2025 స్కూల్ అసిస్టెంట్ సోషియల్ విభాగంలో సోదనపల్లికి చెందిన అట్టే మోహన్ బాబు సత్తా చాటి జిల్లా స్థాయిలో 50 ర్యాంకు సాధించాడు. గ్రామానికి చెందిన వీరానారప్ప రెండో కుమారుడు అట్టే మోహన్‌బాబు మెగా డీఎస్సీ- 2025లో జిల్లా స్థాయిలో 76.52 మార్కులతో 50 ర్యాంకు సాధించాడు. దీంతో ఆయన కుటుంబంలో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి.

కూలీల బిడ్డకు పీఈటీ పోస్టు



ఉరవకొండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన మౌనిక ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ) పోస్టుకు ఎంపికయ్యారు. మెగా డీఎస్సీ- 2025లో జోనల్ స్థాయిలో 84 మార్కులు సాధించారు. దీంతో ఆమెకు జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు దక్కింది. వ్యవసాయ కూలీలైన మౌనిక తల్లిదండ్రులు తమ కుమార్తె విజయాన్ని చూసి ఉప్పొంగిపోయారు.

నిరుపేదకు 12వ ర్యాంకు



గుడిబండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీఎన్ పాళ్యం గ్రామానికి చెందిన వెంకటేశ్, పద్మావతి దంపతుల కుమారుడు చంద్రశేఖర్ డీఎస్సీ-2025లో సోషియల్ సబ్జెక్టులో 12వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యాడు. నిరుపేద కుటుంబంలో జన్మించిన చంద్రశేఖర్ చక్కగా చదువుకుని ఉద్యోగం సాధించడంతో గ్రామస్థులు అతడిని అభినందించారు.

డబుల్ ధమాకా..!



ఓబుళదేవరచెరువు, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన లక్కోరి రమేష్ డీఎస్సీ-2025లో రెండు పోస్టులు సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన రమేష్ పీజీటీ జువాలజీ సబ్జెక్టులో జోన్-4లో 71.5 మార్కులతో రెండో ర్యాంకు సాధించాడు. అలాగే బయాలజీ స్కూల్ అసిస్టెంట్‌లో 80.03 మార్కులతో జిల్లాలో 22వ ర్యాంక్‌లో నిలిచారు.

సడలని దీక్షతో ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన కామర్తి నవీన

కళ్యాణదుర్గం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అరమార్కుతో కోల్పోయిన ఉద్యోగ అవకాశం ఆమెలో మరింత పట్టుదలను పెంచింది. మొక్కవోని దీక్షతో శ్రమిస్తూ డీఎస్సీ-2025లో రెండు ఉద్యోగాలు సాధించింది. ఆమే కళ్యాణదుర్గానికి చెందిన కామర్తి నవీన. డీఎస్సీ-2018లో అరమార్కు తేడాతో ఈమె ఎస్జీటీ ఉద్యోగాన్ని కోల్పోయింది. అయితే కుంగిపోకుండా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మరింత పట్టుదలగా చదివింది. పాఠ్యపుస్తకాలు, విద్యా సంబంధిత మ్యాగజైన్లలోని సమాచారాన్ని బాగా ఒంటబట్టించుకుని, ప్రతి రోజూ ప్రాక్టీస్ పేపర్లు రాసింది. ఈ నేపథ్యంలో 2025లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైంది. అలాగే డీఎస్సీలో 75.06 మార్కులతో 68వ ర్యాంకు సాధించి సోషియల్ స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైంది. అలాగే టీజీటీ సోషియల్ సబ్జెక్టులో రాయలసీమ జోన్ 70.42 మార్కులతో 89వ ర్యాంకుతో ఉద్యోగం సాధించింది. ఒకేసారి రెండు టీచర్ పోస్టులకు ఎంపికవడంతో తల్లిదండ్రులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తచెరువుకు కొలువుల పంట

కొత్తచెరువు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన టి.మాధవి డీఎస్సీ-2025 ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 86.48 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. స్కూల్ అసిస్టెంట్ గణితంలో కొత్తచెరువుకు చెందిన పి.కిరణ్‌కుమార్ 80.6 మార్కులతో 13వర్యాంకుతో ప్రభుత్వ కొలువుకు ఎంపికయ్యాడు. అలాగే నవ్యశ్రీ 86.61 మార్కులతో 45వ ర్యాంకు సాధించి ఎస్జీటీ పోస్టు సాధించారు. మండలంలోని కేశాపురం గ్రామానికి చెందిన ఉడుముల నరేశ్ ఫిజికల్ డైరెక్టర్ పోస్టుకు పరీక్షలు రాసి 88.5 మార్కులతో మూడో ర్యాంకు సాధించాడు. ఇరగంపల్లికి చెందిన అంకే భార్గవ 84.5 మార్కులతో పదో ర్యాంకు సాధించి, స్కూల్ అసిస్టెంట్ పీడీ పోస్టుకు ఎంపికయ్యాడు. తలమర్లకు చెందిన పి.సురేశ్ 78.78 మార్కులు సాధించి 16వర్యాంకుతో స్కూల్ అసిస్టెంట్ తెలుగు పోస్టు సాధించాడు. తలమర్లకు డి.వెంకటరమణమ్మ 82.80 మార్కులు సాధించి 137 ర్యాంకుతో ఈడబ్ల్యూసీ కోటా కింద ఎస్జీటీ పోస్టును సాధించారు.



మాధవి



ఉడుముల నరేశ్



అంకెభార్గవ



కిరణ్‌కుమార్



సురేశ్



నవ్యశ్రీ



వెంకటరత్నమ్మ

కానిస్టేబుల్.. ఇక టీచర్



పుట్లూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రమ, పట్టుదలతో ఓ మహిళా కానిస్టేబుల్ తాను కలలుగన్న టీచర్ పోస్టును సాధించారు. పెద్దపప్పూరు మండలం జూటూరు గ్రామానికి చెందిన నాగరాజు, దేవి దంపతుల కుమార్తె వసుంధర డీఎస్సీ-2025లో 59వ ర్యాంకుతో ఎస్జీటీ పోస్టు సాధించారు. అనారోగ్యంతో తండ్రి మృతి చెందడంతో తల్లి పాడి ద్వారా కుటుంబాన్ని పోషించింది. తల్లి కష్టాన్ని గమనిస్తూ పెరిగిన వసుంధర ఆమె బాధ్యతలను పంచుకోవాలని భావించింది. ఈక్రమంలోనే ఆరేళ్ల కిందట పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి తల్లికి అండగా నిలిచింది. కానీ తాను చిన్నప్పటి నుంచి కలలు గన్న టీచర్ పోస్టుపై కోరికను ఆమె విడిచిపెట్టలేదు. ఒక వైపు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూనే లక్ష్యాన్ని ఛేదించడానికి అహర్నిశలు కృషి చేసింది. ఈక్రమంలోనే అనంతపురంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుని మంచి ర్యాంకు సాధించి తన కలను నెరవేర్చుకుంది.

కణేకల్లులో...



కణేకల్లు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన చాకలి అశోక్ డీఎస్సీ-2025లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో జిల్లాస్థాయిలో ఆరో ర్యాంక్ సాధించాడు. 2017లో ఈయన పోలీస్ శాఖలో చేరారు. ప్రస్తుతం స్పెషల్ డిపార్ట్‌మెంట్ విభాగంలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్నారు. అప్పటి నుంచి ఓవైపు విధులు నిర్వహిస్తూనే, డీఎస్సీకి ప్రిపేరయ్యారు. ఆమేరకు 86.5 మార్కులు సాధించి తన ఉపాధ్యాయ కలను నెరవేర్చుకున్నారు.

సోమందేపల్లిలో



సోమందేపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న నరేష్ డీఎస్సీ-2025లో ఫిజిక్స్ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. 73.70 మార్కులతో 36వ ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈయన 2013లో కానిస్టేబుల్‌గా ఎంపికై పెనుకొండ, ముదిగుబ్బ, సోమందేపల్లిలో పనిచేశాడు. బీఈడీ పూర్తిచేసి టీచర్ వృత్తిలో రాణించాలన్న ఆకాంక్షతో గతంలో రెండుసార్లు డీఎస్సీ పరీక్షలు రాసినా అదృష్టం వరించలేదు. అయితే పట్టువీడక ప్రయత్నించడంతో చిరకాల స్వప్నం నెరవేరింది.

వెల్ఫేర్ అసిస్టెంట్‌కు నాలుగో ర్యాంక్



గోరంట్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చంద్రకళకు డీఎస్సీ-2025లో నాలుగో ర్యాంకు లభించింది. అమడగూరు మండలంలోని కందుకూరిపల్లికి చెందిన చంద్రకళ ఫిజిక్స్ అసిస్టెంట్ పోస్టు కోసం పరీక్షలు రాసింది. ఈమెకు డీఎస్సీలో 82.53 మార్కులు వచ్చాయి. ఈమె భర్త గిరి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

ఎస్జీటీ పోస్టుల్లో జిల్లా టాపర్లు వీరే

పేరు	ర్యాంకు	మార్కులు
చింతా దివ్యశ్రీ	మొదటి ర్యాంకు	92.79
ఉక్కుసల సాయికుమార్	రెండోర్యాంకు	92.70
గంజి రాశి	మూడోర్యాంకు	92.46

స్కూల్ అసిస్టెంట్ టాపర్లు వీరే

సబ్జెక్టు	పేరు	ర్యాంకు	మార్కులు
ఇంగ్లిష్	టి. మాధవి	మొదటిర్యాంకు	86.48
ఇంగ్లిష్	బండి ఉదయ్‌బాస్కర్	రెండోర్యాంకు	85.89
ఇంగ్లిష్	అలివిగొండ సిద్దార్థ	మూడోర్యాంకు	84.99
హిందీ	పవన్‌నారాయణకౌశిక్	మొదటిర్యాంకు	84.03
హిందీ	సిద్దవటం వరలక్ష్మి	రెండోర్యాంకు	82.68
హిందీ	గుజ్జల అమృతవాణి	మూడోర్యాంకు	79.52
తెలుగు	గవ్వల బాలచంద్ర	మొదటిర్యాంకు	84.92
తెలుగు	గంధం అశోక్‌కుమార్	రెండోర్యాంకు	83.88
తెలుగు	ఎన్.వెంకటరమణమ్మ	మూడోర్యాంకు	83.87
బయాలజీ	గౌనీ మధు	మొదటిర్యాంకు	88.52
బయాలజీ	వంగలపల్లిదేవరాజ్	రెండోర్యాంకు	87.32
బయాలజీ	దేవరపల్లి రాజ్‌కుమార్	మూడోర్యాంకు	84.06
ఫిజికల్‌సైన్స్	తలారి సురేష్	మొదటిర్యాంకు	87.95
ఫిజికల్‌సైన్స్	కట్టా సురేష్‌బాబు	రెండోర్యాంకు	83.25
ఫిజికల్‌సైన్స్	కె. వాసుదేవరావు వేదవ్యాస్	మూడోర్యాంకు	83.23
గణితం	పోర్నాల మంజుల	మొదటిర్యాంకు	87.89
గణితం	ఇ.చంద్రమౌళి	రెండోర్యాంకు	86.46
గణితం	పసుపులేటి లక్ష్మీదేవి	మూడోర్యాంకు	84.19
సోషియల్	పలమాసి అమరేష్	మొదటిర్యాంకు	88.89
సోషియల్	సపరే వెంకటేశులు	రెండోర్యాంకు	85.58
సోషియల్	కులగుంట్ల జ్యోతి	మూడోర్యాంకు	84.58
ఫిజికల్ డైరెక్టర్లు			
	భజంత్రీ ఉమామహేష్	మొదటిర్యాంకు	92.05
	కాలమ్మగారి సురేష్‌బాబు	రెండోర్యాంకు	92.00
	ఉడమాల నరేష్	మూడోర్యాంకు	88.00
ఉర్దూ సోషియల్			
	షేక్‌సల్మా	మొదటిర్యాంకు	55.08
	షేక్ రష్మిత్	రెండోర్యాంకు	54.00
	పి.హుషేన్‌బాషా	మూడోర్యాంకు	52.00

ఉర్దూలో మొదటి ర్యాంక్



కదిరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎస్జీటీ (ఉర్దూ)లో తలుపుల మండలానికి చెందిన పఠాన్ టోపీ వలికి మొదటి ర్యాంక్ సాధించాడు. ఈయన డీఎస్సీలో 74.97 మార్కులు సాధించాడు. టోపీ వలీ తండ్రి సాధారణ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో ఆయన సంతోషంతో ఉప్పొంగిపోయాడు.

నిబంధనల మేరకే వెరిఫికేషన్



వెరిఫికేషన్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

డీఎస్సీ కమిటీలతో డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిబంధనల మేరకే చేపట్టాలని డీఈఓ ప్రసాద్‌బాబు కమిటీలకు సూచించారు. పీవీకేకే ఎంబీఏ కళాశాలలో వెరిఫికేషన్ కమిటీలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ నియామకాల్లో వెరిఫికేషన్ ప్రక్రియ అత్యంత కీలకమైనదన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇచ్చిన మార్గదర్శకాలను విధిగా పాటించాలన్నారు. సోమవారం నుంచి వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, ప్రతిఒక్కరు సమయపాలన, నిబంధనలు పాటించాలన్నారు. పరిశీలన అనంతరం ఎక్కడైనా లోటుపాటు బయటపడితే అందుకు మీదే బాధ్యత అని హెచ్చరించారు. సమావేశంలో డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఏడీ మునీర్, డిప్యూటీ డీఈఓలు మల్లారెడ్డి, శ్రీనివాసరావు, ఏఎస్ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

బుక్కరాయసముద్రం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలంపల్లి గ్రామంలో కడుపునొప్పి తాళలేక అమృత(23) శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ గణేశ్‌కు నాలుగేళ్ల కిందట అమృతతో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల ఒక కుమారుడు ఉన్నాడు. గత కొంత కాలం నుంచి అమృత కడుపు నొప్పితో బాధపడుతుండేది. పలు చోట్ల చికిత్స చేయించినా కడుపు నొప్పి తగ్గలేదు. దీంతో నొప్పి భరించలేక శనివారం ఇంట్లోనే ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుంది. ఈ సంఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని మహిళ..

నార్పల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ గ్రామంలో మతిస్థిమితం లేని సాకే రాజమ్మ(44)ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన కాటమయ్య భార్య సాకే రాజమ్మ రెండేళ్ల నుంచి మతిస్థిమితం లేకుండా ఉండేది. ఈక్రమంలోనే శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబికులు పలుచోట్ల వెతికినా ఆమె జాడ తెలియలేదు. అయితే గ్రామ సమీపంలోని ఒక తోటలో ఉరి వేసుకుని సాకే రాజమ్మ మృతి చెందిందని స్థానికులు శనివారం కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో వారు వెళ్లి ఉరికి వేలాడుతున్న రాజమ్మ మృతదేహాన్ని కిందకు దించారు. మృతురాలికి కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సాగర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గర్భిణి రాధిక మృతదేహానికి పోస్టుమార్టం

బుక్కరాయసముద్రం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అబార్షన్ సమయంలో వైద్యం వికటించి మృతి చెందిన రాధిక మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. ఈ నెల మూడో తేదీ అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మండలంలోని చెదల్ల గ్రామానికి చెందిన ఐదు నెలల గర్భిణి మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనపై బాధితులు ఎవరికీ ఎటువంటి ఫిర్యాదు చేయలేదు. అయితే డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవీ అనంతపురం మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిబంధనలు ఉల్లఘించి అబార్షన్ చేసి ప్రాణాలు తీశారని, ఆస్పత్రిలో సరైన సౌకర్యాలు లేవని పలు అంశాలపై ఆమె ఫిర్యాదు చేశారు. దీంతో అనంతపురం మూడో పట్టణ పోలీసుస్టేషన్ సీఐ క్రాంతిలాల్, బుక్కరాయసముద్రం సీఐ పుల్లన్న, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, వైద్యకళాశాల ప్రొఫెసర్ చెదల్లకు వెళ్లి సమాధిని తవ్వించి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

ఏసీబీ కేసులో ఆర్టికల్ ఆఫ్ చార్జ్

అనంతపురం అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఏసీబీ కేసులో ఉన్న వ్యవసాయ అధికారి వెంకటేశ్వరప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ గిరిబాబుకు ప్రభుత్వం ఆర్టికల్ ఆఫ్ చార్జ్‌ను జారీ చేసింది. 2023 ఆగస్టులో రాప్తాడు రెగ్యులర్, కూడేరు ఇన్‌చార్జి ఏఓగా పనిచేసిన వెంకటేశ్వరప్రసాద్, అనంతపురం ఏడీఏ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గిరిబాబును ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఓ డీలర్ నుంచి డబ్బులు డిమాండ్ చేసిన నేపథ్యంలో అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ప్రస్తుతం ఏసీబీ కోర్టులో ఈ కేసు నడుస్తోంది. ప్రస్తుతం ఏఓ వెంకటేశ్వరప్రసాద్ శ్రీసత్యసాయి జిల్లాలో, జూనియర్ అసిస్టెంట్ అనంతపురం జిల్లాలో పనిచేస్తున్నారు. వీరిద్దరి వివరణ అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

28న వాకిన్ ఇంటర్వ్యూలు

అనంతపురం రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎంబీఏ విభాగంలో ఖాళీగా ఉన్న అకడమిక్ కన్సల్టెంట్ల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు శనివారం తెలిపారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. ఎంబీఏ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఎంబీఏలో 55శాతం మార్కులు తప్పనిసరిగా వచ్చి ఉండాలని అన్నారు. ఆసక్తి గలవారు తమ సర్టిఫికెట్లతో పాటు రెండు పరిశోధన పత్రాలను తీసుకురావాలని సూచించారు.

డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

అనంతపురం విద్య, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ యువతకు హెవీ మోటారు వాహనాల డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తామని ఎస్సీ కార్పొరేషన్ సంచాలకులు మహీధర్ శనివారం తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలో శిక్షణకు పది మందిని ఎంపిక చేస్తామని తెలిపారు. ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలకు శిక్షణకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారికి జిల్లా ఆర్టీసీ డిపో మేనేజరు ఆధ్వర్యంలో మోటారు డ్రైవింగ్ నేర్పిస్తారని తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

అనంతపురం క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 25వ తేదీన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తామని ఎస్పీ జగదీష్ శనివారం తెలిపారు. సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన పురుష, మహిళా అభ్యర్థులు సోమవారం ఉదయం 8 గంటలకు అనంతపురంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే వెరిఫికేషన్‌కు హాజరుకావాలని సూచించారు. సివిల్ విభాగంలో ఎంపికైన 278 మంది, ఏపీఎస్పీ విభాగంలో ఎంపికైన 210 మంది అభ్యర్థులకు వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులంతా అప్లికేషన్‌తో జత చేసిన అన్ని ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్ సర్టిఫికెట్లు, గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, నాలుగు కలర్ పాసుపోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

టీడీపీ పరిశీలకుల నియామకం

అనంతపురం క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జిల్లాకు ముగ్గురు పార్లమెంట్ కమిటీ పరిశీలకులను నియమించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గానికి పరిశీలకులుగా అమర్నాథ్ రెడ్డి, డోలా బాల వీరాంజినేయస్వామి, మద్దిపట్ల సూర్యప్రకాష్‌ను నియమించారు. పార్లమెంట్ కమిటీల ఏర్పాటు ప్రతిపాదనల సేకరణ కోసం ఈ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ నెల 26న ఇతర పార్లమెంట్ నియోజకవర్గ కమిటీ సమావేశాలతోపాటు, అనంతపురంకమిటీ సమావేశం నిర్వహిస్తారు.

చీనీ టన్ను రూ.18వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 890 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

శ్రావణం.. పరిసమాప్తం

అంజన్నకు విశేష పూజలు



నెట్టికంటి, మురడి, నేమకల్లు ఆలయాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ

గుంతకల్లు, డి.హీరేహాళ్, బొమ్మనహాళ్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శ్రావణ మాసోత్సవాలు శనివారంతో ముగిశాయి. కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో అమావస్య, మాస ఐదో శనివారం సందర్భంగా పూజా కార్యక్రమాలను విశేషంగా నిర్వహించారు. రాత్రి ఒంటె వాహనంపై సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామివారు ఊరేగించారు. ఈఓ విజయ రాజు, ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంటువెంకటేశ్వర్లు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. మురడి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి కుంకుమార్చన, బిల్వార్చన, సహస్రనామార్చన నిర్వహించారు. ఆఖరి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పెద్దమడి ఆనందరెడ్డి, దేవరెడ్డిపల్లి హనుమంతరెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నేమకల్లు ఆంజనేయస్వామికి విశేష పూజలు జరిగాయి. స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రరెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ బందోబస్తును పర్యవేక్షించారు. ఎస్‌ఐ నబీరసూల్, ట్రైనీ ఎస్‌ఐ వినోద్, ఏఎస్‌ఐ హనుమంతరెడ్డి బందోబస్తులో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, మాజీ ధర్మకర్తలు కాశీనాథశెట్టి, శాంతయ్య, టీడీపీ నాయకుడు గాలి బసప్ప పాల్గొన్నారు.

అనుచితంగా ప్రవర్తించి.. హతమయ్యాడు

ధనుంజయ హత్య కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తన భార్యతో అనుచితంగా ప్రవర్తిస్తున్నందుకే మెకానిక్ ధనుంజయను వరుసకు సోదరుడైన శివయ్య హత్య చేశాడని పోలీసులు గుర్తించారు. పట్టణంలోని ఎల్‌పీ సర్కిల్‌లో ఈ నెల 21వ తేదీ రాత్రి జరిగిన మెకానిక్ పాళ్యం ధనుంజయ హత్య జరిగింది. ఈ కేసులో నిందితుడు శివయ్యను అరెస్టు చేశామని డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో శనివారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు తెలిపారు. కేతిరెడ్డి కాలనీ ఎల్-2లో పాళ్యం శివయ్య, ఎల్-3లో అతని పిన్ని కుమారుడు పాళ్యం ధనుంజయ నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ స్నేహంగా ఉంటూ మద్యం సేవించేవారు. శివయ్య భార్యతో ధనుంజయ చెడుగా ప్రవర్తించేవాడు. దీంతో శివయ్య మందలించాడు. అయినా అతనిలో మార్పురాలేదు. దీంతో శివయ్య కక్ష పెంచుకుని పథకం ప్రకారం ఈ నెల 21వతేదీ అర్ధరాత్రి ఎల్‌పీ సర్కిల్‌లో బ్రిడ్జి కింద ధనుంజయను సిమెంట్ ఇటుకతో బాది చంపేశాడు. నిందితుడిని సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్‌ఐ కేతన్న, హెడ్ కానిస్టేబుళ్లు అప్పస్వామి, శివశంకర్, కానిస్టేబుళ్లు రాజప్ప, షాకీర్, బయన్న, సుధీర్‌కుమార్, రాజన్న శనివారం అరెస్టు చేశారని డీఎస్పీ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

ధర్మవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ధర్మవరం పట్టణ, పరిసర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్టు ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఆయన అరెస్టుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన పాల్తూరి రామకృష్ణ అలియాస్ బాలరామకృష్ణన్ ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రం వేలూరులో నివాసముంటున్నాడు. మరో నింది తుడు భగవంతప్ప రామాంజినప్ప కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా పన్నసముద్రం పంచాయతీ అచ్చంపల్లి గ్రామంలో ఉంటున్నారు. వీరిద్దరు ధర్మవరం పట్టణ, పరిసర ప్రాంతాలలో పగటిపూట రెక్కీ నిర్వహిస్తూ రాత్రిపూట ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. అలాగే చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ఆయా ఘటనలపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9లక్షల బంగారం ఆభరణాలు, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై ధర్మవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రెండు, టూటౌన్ పరిధిలో ఒకటి, పావగడ పోలీసు స్టేషన్‌లో రెండు కేసులు ఉన్నాయన్నారు. వీరిద్దరూ ఇదివరకే చోరీ కేసుల్లో కోయంబత్తూరు, అనంతపురం జిల్లాలోని జైళ్లలో శిక్ష అనుభవించారన్నారు. రామాంజి నప్ప కర్ణాటక రాష్ట్రంలో కూడా పలు ఇళ్లలో చోరీలు చేసి ఆభరణాలను బెంగళూరులో విక్రయించాడని వివరించారు. సమావేశంలో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, హెడ్‌కానిస్టేబుల్ అప్పస్వామి, కానిస్టేబుళ్లు రాజప్ప, షాకీర్‌లు పాల్గొన్నారు.

నియోజకవర్గానికో రైతు బజార్

మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ రామాంజనేయులు

అనంతపురంరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికో రైతు బజార్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ రామాంజనేయులు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీలు రాఘవేంద్రకుమార్, నరసింహామూర్తిలతో కలిసి శనివారం ఆయన మార్కెట్ కమిటీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ కమిటీ కార్యదర్శులతో మార్కెట్ ఫీజు వసూళ్లపై చర్చించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ..రైతు బజారుకు నిర్మాణం కోసం అర ఎకరా నుంచి ఒక ఎకర స్థలం కావాల్సి ఉందన్నారు. ఆ మేరకు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూముల సేకరణకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. స్థలాలు లభ్యమైతే రూ.50 లక్షల నుంచి రూ. కోటివరకు నిధులతో రైతు బజారు ఏర్పాటు చేస్తామన్నారు. మార్కెట్ యార్డులలో ఉద్యాన, వ్యవసాయేతర షెడ్లు, కోల్డ్ స్టోరేజీలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రీజియన్‌లో 74 మార్కెట్ కమిటీలుండగా 50కమిటీల్లో పాలకవర్గం ఏర్పాటైనట్లు తెలిపారు.

ఆశాజనకంగా వసూళ్లు

ఈ ఆర్థిక సంవత్సరం మార్కెట్ కమిటీల ఫీజు వసూళ్లు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. రీజియన్‌లోని ఎనిమిది జిల్లాలో 145.35కోట్ల ఫీజు వసూళ్ల లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నాలుగు నెలల్లో రూ.39.54కోట్లు వసూలైనట్లు వెల్లడించారు. నాలుగు నెలల్లో అనంతపురం రూ.13.49కోట్లకు గాను రూ.3.95కోట్లు, చిత్తూరు రూ 10.39కోట్లకు..3.85కోట్లు, కడప రూ.13.53కోట్లకు 3.61కోట్లు, కర్నూలు రూ.40.40కోట్లకు రూ.7.35కోట్లు, నంద్యాల రూ.26.66కోట్లకు..రూ.8.18కోట్లు, తిరుపతి రూ.25.91కోట్లకు..రూ.7.24కోట్లు, అన్నమయ్య రూ.9.15కోట్లకు..3.91కోట్లు, శ్రీ సత్యసాయి రూ.5.82కోట్లకు రూ.1.42కోట్ల మార్కెట్ ఫీజు వసూలైనట్లు తెలిపారు.

గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయండి

జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గణేష్ చతుర్థి ఉత్సవాలను సంబంధిత శాఖాధికారులు, ఉత్సవకమిటీ సభ్యులు సమన్వయంతో విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. కలెక్టరేట్‌లో గణేశ ఉత్సవ సమితి, సంబంధిత అధికారులతో శనివారం ఆయన గణేశ చతుర్థి ఉత్సవ నిర్వహణ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 31 వరకు జరిగే ఉత్సవాలను ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్వహించాలన్నారు. ఉత్సవ నిర్వాహకులు పోలీసు, ఫైర్, మున్సిపల్, పంచాయతీ విభాగాలతో అనుమతి తీసుకోవాలన్నారు. పర్యావరణ హిత మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని సూచించారు. రాత్రి 10గంటల తరువాత లౌడ్‌స్పీకర్లు పెట్టరాదన్నారు. గుత్తి రోడ్డులోని హెచ్చెల్సీకి నీటిని విడుదల చేస్తే... విగ్రహాల నిమజ్జనానికి అనుకూలంగా ఉంటుందని నిర్వాహకులు జేసీకి విన్నవించారు. ఈ అంశంపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆయన ఎస్ఈని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ అష్రఫ్‌అలీ, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు, ఎక్సైజ్ అధికారి రామ్‌మోహన్‌రెడ్డి, పీసీబీ ఈఈ పీవీ కిషోర్, డీఈఓ ప్రసాద్ బాబు, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం: కలెక్టర్

పుట్లూరు, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): వర్షాకాల నేపథ్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కడవకల్లు గ్రామంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. గ్రామాల్లో ఎక్కువగా ఇంకుడు గుంతలు తవ్వుకుంటే వర్షపునీరు భూగర్భజలంగా వృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. కడవకల్లు ఎస్సీకాలనీలో నీరు నిల్వ ఉండకుండా వెళ్లేలా మ్యాజిక్ డ్రైన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతకుముందు గ్రామంలో పర్యటించి లబ్ధిదారులు లక్ష్మీదేవి, భూలక్ష్మి ఇళ్ల వద్ద ఉపాధిహామి పథకం కింద చేపట్టిన వ్యక్తిగత సోక్‌పిట్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. పలురకాల మొక్కలను నాటారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించారు. పాఠశాల మైదానం కోసం అవసరమైన స్థలాన్ని గ్రామంలో గుర్తించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ శేషారెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఓ నాగరాజునాయుడు, జడ్పీ సీఈఓ రామసుబ్బయ్య, డ్వామా పీడీ సలీంబాషా, ఏపీడీ పుల్లారెడ్డి, ఏపీఓ తులసీప్రసాద్, ఈఓఆర్‌డీ శివప్రసాద్, సర్పంచు రామాంజనేయులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి ఫెన్సింగ్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అండర్-17 ఫెన్సింగ్ క్రీడాకారుల సెలెక్షన్‌లు ఈ నెల 25వతేదీన అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తామని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీ కృష్ణ, కార్యదర్శి పుష్పావతి తెలిపారు. అండర్-17 బాల, బాలికల విభాగంలో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. 2009 జనవరి 1 నుంచి 2012 డిసెంబరు 31వ తేదీ లోపు జన్మించిన క్రీడాకారులు అర్హులని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రితో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9553768295లో సంప్రదించాలని కోరారు.

రేపు సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

ఉమ్మడి జిల్లా సీనియర్ మహిళా సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణుల ఎంపిక పోటీలు ఈనెల 25వ తేదీన ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తామని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గాయత్రి, గంగమ్మ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30వ తేదీన గుంటూరు జిల్లా సత్తెనపల్లి లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా సాఫ్ట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు తమ జననధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 7989017210లో సంప్రదించాలని కోరారు.

28న రాష్ట్రస్థాయి పారా బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు

పారా రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ జూనియర్, యూత్ పోటీలు ఈ నెల 28న అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తామని జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. ఆసక్తి, అర్హతగల పారా క్రీడాకారులు ఈ నెల 26వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలు జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9390388169, 8074106154లో సంప్రదించాలని కోరారు.

ఆరోగ్యంపై అవగాహనకు క్విజ్

అనంతపురం వైద్యం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖవ్యాధులు, కౌమార ఆరోగ్యం, మాదక ద్రవ్యాలతో అనర్థాలపై విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన పోటీలకు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీడీ నియంత్రణ విభాగాధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, డీవీఈఓ వెంకటరమణ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థుల్లో ఆరోగ్యం పట్ల అవగాహన పెంచేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డాక్టర్ అనుప జేమ్స్ తెలిపారు. క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతిని ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు హేమంత్, చరణ్ తేజ, ద్వితీయ బహుమతిని తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గౌసియా, సిద్దిబాషావలి, తృతీయ బహుమతిని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మౌనిక, ధరణి గెలుపొందారు. ఈ నెల 26న విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రథమ, ద్వితీయ బహుమతి పొందిన విద్యార్థులు వెళతారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గురుప్రసాద్, నోడల్ ఆఫీసర్ ఉషా కుమారి, ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ వెంకటరత్నం, సూపర్‌వైజర్లు రమణ, మురళీ, రిడ్స్ మేనేజర్ నరేష్‌బాబు, శివారెడ్డి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.34

అనంతపురంరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.20, సరాసరిధర రూ.27తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,105 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీపురు పట్టిన న్యాయాధికారులు



కోర్టులో గదిని శుభ్రం చేస్తున్న ఏడీజే

హిందూపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయాధికారి కంపెల్లె శైలజ, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్ శనివారం పాల్గొన్నారు. చీపురు చేతబట్టి న్యాయస్థానంలో శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ తమ కార్యాలయాలు, ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు. దీనివల్ల దేశానికి సేవ చేసినవారమవుతామని అన్నారు. పరిశుభ్రత సమాజాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.

అర్హులైన ప్రతి దివ్యాంగుడికి పింఛన్

- చైర్మన్ గడిపూటి నారాయణస్వామి



మాట్లాడుతున్న నారాయణస్వామి

అనంతపురం క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన ప్రతి దివ్యాంగుడికి పింఛన్ అందుతుందని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్మన్ గడిపూటి నారాయణస్వామి పేర్కొన్నారు. స్థానిక ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో శనివారం ఆయన భిన్న ప్రతిభావంతుల జాతీయహక్కుల ఐక్యవేదిక, ఇతర నాయకులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో అనర్హులు చాలా మంది పించన్ల పేరుతో ప్రభుత్వ నిధులు స్వాహా చేశారన్నారు. వాటిని కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ చేస్తోందన్నారు. ఏ ఒక్క దివ్యాంగుడికి పింఛన్ రద్దు కాదని ఆయన స్పష్టం చేవారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల జాతీయహక్కుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు వసంత కుమార్, జిల్లా కార్యదర్శి రామయ్య, కమిటీ నాయకులు రాజేష్, సింహ మోహన్, ఇతర నాయకులు మాబు, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్యంతో గర్భిణి మృతి



హారిక (ఫైల్)

యాడికి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీరన్నపల్లి గ్రామానికి చెందిన మూడునెలల గర్భిణి హారిక(22) అనారోగ్యం కారణంగా శనివారం మృతిచెందారు. హారిక, కేశవ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఏడాది వయసున్న కూతురు కావ్య ఉంది. హారిక శుక్రవారం పాడి పశువులు కాయడానికి వెళ్లి వచ్చారు. రాత్రి కడుపు నొప్పితో బాధపడ్డారు. వాంతులు, విరేచనాలు అయ్యాయి, ఫిట్స్ కూడా వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను యాడికి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం తాడిపత్రికి, మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హారిక మృతిచెందారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, ఆరోగ్యసిబ్బంది వీరన్నపల్లి గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. అనారోగ్యంతోనే హారిక మృతిచెందినట్లు తెలిపారు.

కంటైనర్లను అడ్డుకున్న నాయకులు

పెనుకొండ రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కియ అనుబంధ పరిశ్రమ 'సంగు హైటెక్ కంపెనీ'లో పనులు తమకే కవాలని కొందరు నాయకులు కంటైనర్లను శనివారం అడ్డుకున్నారు. ఆ కంపెనీలో వైసీపీ నాయకులు కాంట్రాక్ట్ పనులు చేస్తున్నారు. ఆ పనులను రద్దుచేసి తమకు ఇవ్వాలని కోరుతూ శనివారం సాయంత్రం సంగు కంపెనీ నుంచి వస్తున్న కంటైనర్లను ఆపి, డ్రైవర్లను బెదిరించారు. విషయం తెలుసుకున్న కియ పోలీసులు అక్కడికి చేరుకునేలోగా వారు పరారయ్యారు. నాలుగు ద్విచక్రవాహనాల్లో ఐదుగురు వచ్చి బెదిరించారని డ్రైవర్లు తెలిపారు. ఈ విషయంపై కియ ఎస్‌ఐ రాజేష్‌ను వివరణ కోరగా, టీడీపీ నాయకులే పనుల కోసం ఇలా చేస్తున్నారని తెలిపారు.

న్యూస్ బాక్స్

కాలభైరవుడి ఆలయంలో దీపోత్సవం



ఆలయం ఎదుట దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ధర్మవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాలభైరవ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించినట్టు ఆలయ పూజారి ధనుంజయ ఆచారి తెలిపారు. శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు పూజలు జరిగాయన్నారు. అమావాస్య ఘడియల్లో అనంతరం కూష్మాండ దీపోత్సవాన్ని ప్రారంభించారు. పలుప్రాంతా ల నుంచి వచ్చిన భక్తులు ఆలయం ఎదుట గుమ్మడికాయపై దీపాలు వెలిగించారు. అనంతరం దాతలు అన్నదాన చేశారు.

● ధర్మవరం/ తనకల్లు: ధర్మవరం పట్టణంలోని మార్కెండేయ స్వామి ఆలయంలో శ్రావణ మాసం శనివారం సాయంత్రం మహాలక్ష్మికి అమావాస్య పూజలు నిర్వహించారు. పద్మశాలీయ బహూత్తమ సంఘం అధ్య క్షులు పుత్తా రుద్రయ్య, ఉపాధ్యక్షుడు జింకా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. అలాగే తనకల్లు: మండలపరిధిలోని కొక్కంటిక్రాస్‌లో ఉన్న చౌడేశ్వరీదేవికి శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు.

ఎస్సీ వ్యాపార గదులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎస్సీలకు కేటాయించిన వ్యాపార గదులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈవో శ్రీనివాస్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 1, 8, 34, 35, 42, 44, 48 వ్యాపార గదులకు ఈ నెల 30 తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ గదులకు దరఖాస్తు చేసుకు వారు స్థానికులై ఉండి, గ్రామ పంచాయతీకి ఎలాంటి బకాయిలు లేనివారు మాత్రమే అర్హులన్నారు.

సత్యసాయి తత్వప్రచారమే లక్ష్యం

● సత్యరూప్ పట్నాయక్



ప్రసంగిస్తున్న సత్యస్వరూప్

పుట్టపర్తి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి ప్రేమతత్వం, ఆధ్యాత్మిక బోధనలను ప్రచారం చేయడమే తమ లక్ష్యమని సత్యసాయి సేవా సంస్థల ఒడిసా రాష్ట్ర అధ్యక్షుడు సత్యరూప్ పట్నాయక్ అన్నారు. పర్తి యాత్రలో భాగంగా ఒడిసా భక్తులు 2500 మంది శనివారం ప్రశాంతినిలయంకు చేరుకున్నారు. సాయికుల్వంతు సభా మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి దివ్య పాదుక రథయాత్రను మూడు సంవత్సరాలుగా, 1213 రోజుల పాటు 9600 గ్రామాలలో నిర్వహించామని ఈ సందర్భంగా సత్యరూప్ తెలిపారు. సత్యసాయి ప్రేమతత్వాన్ని, బోధనలను విస్తృతంగా ప్రచారం చేశామని అన్నారు. నేటితో రథయాత్ర ముగిసిందని అన్నారు. అనంతరం కృష్ణాష్టకం, సద్గురుసాయి అష్టోత్తరం, నవరత్నమాల భక్తిగీతాలను భక్తులు ఆలపించారు. యువత రథోత్సవం పేరిట నృత్య ప్రదర్శన, నాటక ప్రదర్శన ఇచ్చారు. సత్యసాయి ప్రేమతత్వం, పురాణాల్లోని ఘట్టాలను ప్రదర్శించారు. అనంతరం సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.

కళాశాలకు కంప్యూటర్ వితరణ

ధర్మవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వంశీకృష్ణ గ్లోబల్ స్కూల్ అధినేత బీరే గోపాలక్రిష్ణ ఆయన కుటుంబసభ్యులు స్థానిక బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల కు కంప్యూటర్‌ను వితరణ చేశారు. కళాశాల చైర్మన్ బండి వేణుగోపాల్, ప్రిన్సిపాల్ వనితావాణికి శనివారం అందజేశారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

గాండ్లపెంట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాబురావు, వ్యవసాయాధికారి షాదాబ్ శనివారం తనిఖీ చేశారు. ఇటీవల రైతులు సాగుచేసుకుంటున్న వరి పంటకు యూరియా కొరత ఏర్పడినట్లు ప్రభుత్వం దృష్టికి వెళ్లిన విషయం తెలిసిందే. దీనిపై తహసీల్దార్, ఏఓ పలు ఎరువుల దుకాణాలను పరిశీలించారు. నానో యూరియాను చల్లినా యూరియాతో సమానంగా ఫలితాలు ఉంటాయని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

హుండీలో నగదు చోరీ

నల్లచెరువు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కె.పూలకుంట రోడ్డులోని గీతామందిరం, మార్కెండ్‌స్వామి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వారు హుండీలను ధ్వంసం చేసి దాదాపు రూ.40వేల నగదు ఎత్తుకెళ్లినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అర్చకులు శుక్రవారం సాయంత్రం ఆలయానికి తాళం వేసి, ఇంటికెళ్లారు. శనివారం ఉదయం ఆలయానికి వచ్చిన ఆయన ఆలయం పగలకొట్టిన విషయాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

నంబులపూలకుంట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మగుట్టపల్లిలో భూ వివాదంపై ఘర్షణ పడిన సంఘటనలో ఒకరికి గాయాలు అయ్యాయని హెడ్‌కానిస్టేబుల్ మహేష్ శనివారం తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కమ్మగుట్టపల్లిలో పొలాలను దుక్కి శుక్రవారం చేశారు. పొలాలను దుక్కి చేస్తే రస్తా ఉండదన్న కారణంతో జరిగిన ఘర్షణలో రామచంద్రారెడ్డి అనే వ్యక్తి గాయపడగా ఆయనను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు చంద్రశేఖర్‌రెడ్డి, తులసమ్మ, సిద్దమ్మపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టీడీపీ నాయకుల చొరవతో డ్రైనేజీలు శుభ్రం

ధర్మవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డులో పూడి పోయిన డ్రైనేజీ కాలువలను పారిశుధ్య కార్మికులతో కలిసి టీడీపీ నాయకులు శుభ్రంచేశారు. 25వ వార్డులో డ్రైనేజీ కాలువలు పూడి పోయి వర్షాలు వచ్చినప్పుడు మురుగు నీరంతా రోడ్డుపైకి వస్తోందని గత నెలలో నిర్వహించిన మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌కు స్థానికులు అర్జీలు ఇచ్చారు. ఆయన సూచనల మేరకు శనివారం టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు, ఉపాధ్యక్షుడు చీమల రామాంజి, పారిశుధ్య కార్మికులు శుభ్రం మురుగు కాలువలను శుభ్రం చేశారు. టీడీపీ నాయకులు మాధవరెడ్డి, క్లస్టర్ రామాంజి, అమర్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో భూమిని తొలగించారని ఆందోళన

కదిరి అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తమ పేరుమీద ఉన్న భూమిని ఆన్‌లైన్‌లో తొలగించారంటూ పట్టణంలోని సైదాపురానికి చెందిన రైతు రాజేష్, కుటుంబ సభ్యులు శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. సైదాపురం పొలంలో సర్వే నెంబర్ 180-1లో తమ పూర్వీకుల నుంచి సక్రమించిన 46సెంట్లు భూమిని ఆరునెలల క్రితం ఆన్‌లైన్ చేయించుకున్నామని తెలిపారు. అయితే ప్రస్తుతం తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే రెవెన్యూ అధికారులు మిగులు భూమిగా చూపి స్తూ ఆన్‌లైన్‌లో తమ పేరు తొలగించారన్నారు. అర్హులకు న్యా యం చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రోడ్డుపై మురుగునీటి ప్రవాహం



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

గాండ్లపెంట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డ్రైనేజీ కాలువలు పూడిపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. మురుగునీరు వెళ్లడానికి ఏర్పాటు చేసిన కాలువలు చెత్తచెదారంతో నిండిపోయాయి. జీన్లకుంట రోడ్డులోని వెలుగు కార్యాలయానికి వెళ్లే దారిలో కాలువ పూడిపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే పారుతోంని. ఆ నీటిలోనే నడుచుకుంటూ కార్యాలయాలకు, వీధిలోకి వెళ్లాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. అంతేగాకుండా మురుగునీరు నిలువ ఉండడంతో దోమలు వృద్ధిచెంది విషజ్వరాల బారిన పడాల్సి వస్తోందంటున్నారు. ప్రతి నాలుగో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివాస్ అంటూ అధికారులు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారేకానీ, కాలువల్లో చెత్త తొలగించడాన్ని పట్టించుకోవడంలేదని ప్రజలు మండిపడుతున్నారు. గ్రామంలోని పలు గ్రామాల్లో మురుగునీటి కాలువులు పూడిపోయాయని తెలిపారు. ఇప్పటికైనా గ్రామాల్లో మురుగునీటి కాలువలు శుభ్రంచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

● భక్తులతో కిటకిటలాడిన పాలపాటిదిన్నె ఆలయం



పాలపాటి దిన్నెలో ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

నల్లచెరువు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయం శ్రావణమాసం చివరి శనివారం పురస్కరించుకుని భక్తులతో కిటకిటలా డింది. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి ఊరేగించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఓరువాయి పంచాయతీలోని చెరువాండ్లపల్లికి చెందిన గోనే అక్కులప్ప అన్నదానం చేశారు. ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నిడిపారు. ఎస్ఐ మగ్బుల్‌బాషా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

● ముదిగుబ్బ/ అమడగూరు: శ్రావణమాసం చివరి శనివారం పురస్కరించుకుని ముదిగ్బు మండల పరిధిలోని దొరిగల్లు గ్రామంలో వెలసిన వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టి, అన్నసం తర్పణ చేశారు. అలాగే అమడగూరు మండలపరిధిలోని మహమ్మదాబాద్ లో పిచ్చిలకొండ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అలంకరణలో దొరిగల్లు వీరాంజనేయస్వామి
మహమ్మదాబాద్ పిచ్చిలకొండ ఆంజనేయస్వామి

కబ్జాకు గురైన ప్రదేశాలను గుర్తిస్తున్నాం

● ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నాం

● అమరావతిపై అసత్య ప్రచారాలు: మంత్రి సత్యకుమార్



అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి

ధర్మవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గతంలో పట్టణంలో కబ్జాకు గురైన ప్రదేశాలను గుర్తించి, వాటిని తిరిగి స్వాధీనం చేసుకుంటున్నామని... ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఆయన శనివారం పట్టణంలోని రాంనగర్‌లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చు ట్టారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం 15వ ఆర్థిక ఆర్థిక సంఘం నిధులు రూ. 122.87లక్షల అంచనావ్యయంతో చేపట్టబోయే ఈ పనుల్లో రోడ్ల నిర్మాణం, డ్రైన్ల ఏర్పాటు, తాగునీటి పైపులైన్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం వంటి వాటికి జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధు సూదన్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అలాగే అమృత్2.0, అమృత్ ఫేజ్-22 పథకాల కింద రూ. కోట్లతో పెద్దస్థాయిలో చేపట్టిన తాగునీటి నిల్వ ట్యాంకులు నిర్మాణ దశలో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గతంలో పట్టణంలో కబ్జాకు గురైన ప్రదేశాలను గుర్తించి, వాటిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పార్కుల ఏర్పాటు వల్ల పట్టణం మరింత అందంగా మారుతోందన్నారు. అలాగే మార్కెట్‌యార్డ్‌లో ఏర్పాటు చేయనున్న మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్ స్థలాన్ని వ్యవసాయశాఖ నుంచి జౌళి శాఖకు ఇప్పటికే బదిలీచేశామన్నారు. త్వరలో ఢిల్లీ నుండి ప్రత్యేక బృందం వచ్చి ఆ స్థలాన్ని పరిశీలించాక, టెండర్లను పిలుస్తామన్నారు. దాదాపు 22 వేల మందికి ఉపాధి కలిగించే ఈ ప్రాజెక్టుపై కొందరు తప్పుడు ప్రచారాలు దుర దృష్టకరమన్నారు. అలాగే రాజధాని అమరావతిలో నీరు నిల్వ ఉంటోందంటూ అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఈఈ సాయికృష్ణ, డీఈలు వీరేశ్, ప్రభుదాస్, చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధా రాఘవ, జింకా పురుషోత్తం, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి సాకే ఓబులేశు, పట్టణ అధ్యక్షుడు జింకా చంద్ర, జనసేన నాయకులు బెస్త శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై విద్యార్థుల్లో చైతన్యం కలిగించాలి

పరిశుభ్రమైన పరిసరాలు సమాజాభివృద్ధికి పునాది అని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని కొత్తపేట ప్రభుత్వ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కల్పించేందుకు మంత్రి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మంత్రి మాట్లాడు తూ... పరిశుభ్రమైన పరిసరాలు సమాజాభివృద్ధికి బాటలు వేస్తాయన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులు శుభ్రత, పర్యావరణ పరిరక్షణపట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అందరం కలికట్టుగా స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను సాధిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, పాఠశాలహెచ్‌ఎం రాంప్రసాద్, పీడీ అశ్విని తదితరులుపాల్గొన్నారు.

ఫేక్ వీడియో రమేష్‌పై టీడీపీ నేతల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

బుక్కపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తన పింఛన్ తొలగించారని ఫేక్ వీడియో చేసిన నారసింపల్లికి చెందిన రమేష్‌పై టీడీపీ నాయకులు శనివారం పోలీసులకు పిర్యాదు చేశారు. తాను దివ్యాంగుడని, తన పింఛన్ తొలగించారంటూ... అతడికి రెండు చేతులున్నా ఒక చేయిలేని దివ్యాంగుడిలా ఫేక్ వీడియో చేసి కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయాలని అనుకున్న అతడిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్లు చింతా మల్లిరెడ్డి, కేశప్ప, నాయకులు అంబులెన్స్ రమేష్, వెంకట రాముడు, సుదీర్, మంజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. వైసీపీ పాలనలో విపరీతంగా ఇచ్చిన బోగస్ పింఛన్ల ఏరివేతను కూటమి ప్రభుత్వం చేపట్టింది. అందుకు దివ్యాంగ సర్టిఫికెట్లను పునఃపరిశీలన చేపట్టారు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మేందుకు రమేష్ ఇటీవల ఓ వీడియో చేసి సోషల్ మీడియాలో పెట్టారు, తన చేయిని షర్టులో దాచుకుని, తాను చేయిలేని ద్వివాంగుడని, వైసీపీ పాలనలో పింఛన్ మంజూరు చేశారని, రీవెరిఫికేషన్ పేరుతో కూటమి ప్రభుత్వ తొలగిందని అందులో ఉంది. దీనిపై ఆంధ్రజ్యోతి ఫెక్ వీడియో అన్నవార్త శనివారం ప్రధాన సంచికలో కథనం ప్రచురించింది. ఫేక్ వీడియోపై టీడీపీ నాయకులు మండిపడ్డారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ క్రిష్ణమూర్తి విచారణ చేపట్టారు. రమేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ కుట్రలో ఇంకా ఎవరైనా వైసీపీ నాయకులున్నారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

క్రీడా పోటీలలో ధర్మవరం విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా ఏపీఎస్ఎఫ్ విద్యార్థిసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్టు పట్టణంలోని శ్రీసాయి డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ ఫణికుమార్ తెలిపారు. కళాశాలకు చెందిన కబడ్డ పోటీల్లో రన్నర్స్‌గా, వాలీబాల్‌లె విన్నర్స్‌గా నిలిచారన్నారు. వారిని ప్రిన్సిపాల్‌తో పాటు ఏఓ శ్రీనివాసులు శనివారం అభినందించారు.

వరిపంట తొలగించేందుకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ధర్మవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలోని పోతులనాగే పల్లి లే అవుట్లలో ఉన్న మున్సిపల్ రిజర్వుడు స్థలంలో నాటిన వరి పంటను తొలగించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపల్ రిజర్వుడు స్థలంలో వరి సాగుపై 'ఎవరికీ పట్టదా?' అనే శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారి అలివేలమ్మ, సిబ్బంది తమీమ్‌బాషా తదితరులు అక్కడికి వెళ్లి వరిపంటను పరిశీలించారు. కొలతలు వేసి పంటను కొంత మేర తొలగించారు. మిగిలిన పంటను ఆదివారం సాయంత్రంలోగా తొలగించుకోవాలని పంటసాగు చేసిన వారికి సూచించారు.

వేరే ఖాతాలో జమైన 'తల్లికి వందనం' డబ్బులు అందజేత

ధర్మవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 13వ వార్డుకు చెందిన దివ్యాంగురాలు శ్రీదేవి, రవి దంపతుల కుమార్తె హర్షితకు రావాల్సిన 'తల్లికి వందనం' డబ్బులు 23వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు మాల్యవంతం నారాయణస్వామి భార్య అలివేలమ్మ ఖాతాలో జమైంది. ఈ విషయాన్ని గతనెలలో 23వ వార్డులో నిర్వహించిన 'మీ సమ స్య-మా బాధ్యత' కార్యక్రమంలో పరిటాలశ్రీరామ్‌కు దివ్యాంగురాలు శ్రీదేవి తెలియజేసింది. ఆయన సూచన మేరకు అలివేలమ్మ ఖాతాలో జమైన రూ.13వేలను శ్రీదేవికి శనివారం గాంధీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు చింతపులుసు పెద్దన్న, ఐటీడీపీ రామకృష్ణ, చికెన్‌రాము, బీరే శ్రీనివాసులు, కేతా శ్రీనివాసులు, ముత్యాలప్ప, శివరాం చేతులమీదుగా అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్, అగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగాటిపల్లికి చెందిన పుల్లారెడ్డి అనే వ్యక్తి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. పుల్లారెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. దీంతో మనస్థాపానికి గురై శనివారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'పై అవగాహన

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)



దర్శినమలలో పాల్గొన్న ఆర్డీఓ మహేష్, ఎంపీడీఓ సాయిమనోహర్

ధర్మవరం మండలంలోని దర్శినమల గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ మహేష్, ఎంపీడీఓ సాయిమనోహర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఏలూరు వెంకటేష్, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు జంగం నరసింహులు, ప్రజలు పాల్గొన్నారు. అలాగే కొత్తచెరువులో పంచాయతీ ఈవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచా యతీ కార్యాలయం నుంచి ర్యాలీగా నెహ్రూ కూడలి చేరుకున్నారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. నల్లచెరువులో ఎంపీడీఓ రఘునాథ్ గుప్త ఆధ్వర్యంలో ఉన్నతపాఠశాల విద్యార్థులతో కలిసి బస్టాండ్ కూలి వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ జమానుల్లాఖాన్, సర్పంచ్ పంచరత్నమ్మ, ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు. తనకల్లు మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌లో ఎంపీడీఓ రామానాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నల్లగుట్లపల్లి హైస్కూల్ నుంచి కొక్కంటిక్రాస్‌లోని కొక్కంటి రోడ్డు వరకు ర్యాలీ సాగింది. కొక్కంటి రోడ్డులో మానవహారం ఏర్పాటు చేశారు. డాక్టర్ ధర్మరాజు, టీడీపీ నాయకులు సోంపాల్యం నాగభూషణం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, ఉపాధ్యాయులు రెడ్డెప్ప, కార్యదర్శి విజయేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తి మండల పరిధిలోని గువ్వలగుట్టపల్లిలో ఐసీడీఎస్ సిబ్బంది మండలపరిషత్ పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. అంతకు మునుపు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు మస్తాన్, కాంచన, భాగ్యమ్మ, కృష్ణవేణి, దీప, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా శ్రీనివాసుడి కల్యాణం



శ్రీనివాసుడి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

ధర్మవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏడు శనివారాల వ్రతం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీదేవి, భూదేవి, వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంరించి, కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అంతకు మునుపు మూల విరాట్‌కు వివిధ పూజా కార్యక్రమాలు, అభిషేకా లు నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీశ్వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జింకా రాజేంద్రప్రసాద్, సభ్యులు చెన్నంశెట్టి శ్రీనివాసులు, చెన్నంశెట్టి రమేశ్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు

ధర్మవరం రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలపరిధిలోని ధర్మపురిలో శ్రీకృష్ణుడి జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ముగింపు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈనెల16న జన్మాష్టమి నుంచి ప్రత్యేక పూజలందుకున్న శ్రీకృష్ణుడి ప్రతిమను చివరిరోజు పురవీధుల్లో ఊరేగించారు. అన్నదానం చేశారు. ఇందూజ్ఞాన వేదిక ధర్మవరం కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణచారి, ధర్మపురి ఉత్సవ నిర్వాహకుడు నటరాజు తదితరులు పాల్గొన్నారు.

'సీపీఐ నేత సురవరం మృతి బాధాకరం'

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీపీఐ అగ్రనేత సురవరం సుదాకర్‌రెడ్డి మృతి అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సురవరం విద్యార్థినాయకుడి నుండి సీపీఐ జాతీయప్రధాన కార్యదర్శిగా, పార్లమెంట్ సభ్యునిగా ఆయన ప్రజల కోసం ఆహర్నిసలు పనిచేశారని కొనియాడారు. తెలుగు రాష్ట్రాల్లో నిర్మాణాత్మక అభివృద్ధికి ఆయన దోహదపడ్డారన్నారు.

గ్రంథాలయం తనిఖీ

ధర్మవరం రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాబుజగజ్జీవన్‌రామ్ నగర్‌లో ఉన్న గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. పాఠకులు సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి అంజలిసౌభాగ్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకచవితిని ప్రశాంతంగా జరుపుకోండి

ధర్మవరం రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగను ప్రజలందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండలంలోని నిమ్మలకుంట గ్రామంలో ఆయన ప్రజలతో సమావేశమయ్యారు. ఎక్కడైనా గొడవలు దిగినా, ప్రోత్సాహించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

కదిరి అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు క్రిష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఆయన శనివారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు, ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సఖ్యత కుదిర్చేందుకే ప్రజా న్యాయస్థానాలు

మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జయలక్ష్మి

కదిరి లీగల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రజల మధ్య సఖ్యతను కుదిర్చేందుకే ప్రజా న్యాయస్థానాలు పనిచేస్తున్నాయని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జయలక్ష్మి పేర్కొన్నారు. సెప్టెంబరు 13న నిర్వహించే జాతీయ లోక్ ఆదాలత్ కోసం చైర్మన్ అధ్యక్షతన శనివారం స్థానిక కోర్టు ఆవరణంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మరో న్యాయాధికారి పీ లోకనాథం, పోలీస్ అధికారులు, బ్యాంకు అధికారులు, న్యాయ వాదులు తదితరులు పాల్గొన్నారు. ప్రజా న్యాయస్థానాల ద్వారా కేసుల పరిష్కారం ప్రశాంతతకు మార్గమని ప్రజలకు తెలియచెప్పాల్సిన బాధ్యత అన్ని వర్గాల పైన ఉందని ఈ సందర్భంగా న్యాయాధికారులు సూచించారు.

పీపీ పోస్టులలో బీసీలకు 50శాతం కల్పించాలి

● బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర కన్వీనర్

ధర్మవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): న్యాయస్థానాలలో నామినేటెడ్ పీపీ పోస్టులలో బీసీలకు 50శాతం కల్పించాలని బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర కన్వీనర్ నరేశ్ పేర్కొ న్నారు. స్థానిక పెన్షనర్స్ భవనంలో బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా కార్యవర్గ సమావే శాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేకల రామాంజినేయులు, కంసల అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర కన్వీనర్ నరేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షుడు కంసల కిశోర్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, నారా యణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ముదిగుబ్బ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ అధ్యక్షతన ఎంపీడీఓ నసీమా నిర్వహించారు. అధికారులు తమ శాఖల ప్రగతిని వివరిం చారు. మండలంలో చిన్నపాటి పరిశ్రమల ఏర్పాటుకురాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కృషి చేస్తున్నారని, కావు ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూసుకోవాలని ఎంపీపీ తహసీల్దార్‌కు వివరించారు. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై పైస్థాయి అధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

కదిరిఅర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బ్లూమూన్ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డేని ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఇంటర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఈకార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విద్యా సంస్థల చైర్మన్ శివశంకర్ హాజరయ్యారు. విద్యార్థి దశనుంచే చదువుతోపాటు సామాజిక సేవ కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మాకు న్యాయం చేయండి సారూ..!

ఒకరికి వందశాతం మరొకరికి 90శాతం వైకల్యం
మంచానికే పరిమితమైనా రూ.6వేలు పింఛన్
రూ. 15 వేలు ఇప్పించాలంటూ వేడుకోలు

రొద్దం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే వైకల్యం వందశాతం ఉన్నా అధికారులు కనికరించడం లేదు. దీంతో న్యాయం చేయండి సార్ అంటూ బాధిత కుటుంబాలు వేడుకుంటున్నాయి. రొద్దం మండల పరిధిలోని దొడగట్ట గ్రామానికి చెందిన లక్ష్మీనరసమ్మ కుమారుడు తిరుమలేష్ పుట్టుకతోనే రెండు కాళ్లు పనిచేయక మరుగుజ్జుగా పుట్టాడు. లక్ష్మీనరసమ్మ భర్త చనిపోగా కూలీ పనులు చేసుకుంటూ కుమారుడిని పోషిస్తోంది. ఎన్నో ఆసుపత్రులు తిరిగి వేసారిపోయి జీవితకాలమంతా ఇంతేనని డాక్టర్లు తెలపడంతో మిన్నకుండిపోయారు. నడవలేని స్థితిలో వందశాతం వైకల్యం సర్టిఫికెట్ ఇవ్వడంతో రూ.6వేలు పింఛన్ వస్తోంది. అయితే లక్ష్మీనరసమ్మ రోడ్డు ప్రమాదానికి గురై అనారోగ్యంతో బాధపడుతోంది. రూ.6వేలు పింఛన్‌తో కుటుంబాన్ని పోషిస్తోంది. మంచానికే పరిమితమైన కుమారుడికి ప్రభుత్వం రూ.15వేలు పింఛన్ ఇవ్వాలని లక్ష్మీనరసమ్మ వేడుకుంటోంది.


దొడగట్టలో వందశాతం వైకల్యం ఉన్న కుమారుడితో తల్లి

తినిపిస్తే తింటాడు లేదా పస్తులే

పుట్టుకతోనే చాకలి నాగరాజు కుమారుడు చాకలి నరహరికి 90శాతం వైకల్యం ఉంది. ప్రభుత్వం రూ.6వేలు పింఛన్ ఇస్తోంది. అమ్మ తినిపిస్తే తింటాడు లేదా పస్తుంటాడు. మంచానికే పరిమితమైన కుమారుడికి సపర్యలు చేస్తూ తల్లి రూ.6వేలు ప్రభుత్వమిచ్చే పింఛన్‌తో పోషిస్తోంది. బిడ్డని ఇంటి వద్ద వదలలేక కూలీ పనులకు వెళ్లలేక నిరుపేదరికంతో కొట్టుమిట్టాడుతున్నారు. మంచానికే పరిమితమైనా రూ.15వేలు పింఛన్ ఇవ్వకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా అధికారులు స్పందించి ఆ ఇద్దరు వికలాంగులకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు. ఈ విషయంపై రొద్దం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సోమశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా సర్టిఫికెట్లను పరిశీలించి అర్హులైతే న్యాయం చేస్తామన్నారు.


90 శాతం వైకల్యం ఉన్న నరహరికి అన్నం పెడుతున్న తల్లి

ఆదమరిస్తే అంతే సంగతులు


వంతెనను దాటుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పెనుకొండ రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నారాయణమ్మ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణం వద్ద ఆదమరిస్తే ప్రమాదాలకు గురికావాల్సిందే. ఇటీవల పెనుకొండ నుంచి నారాయణమ్మ కాలనీ మీదుగా రూ.83 లక్షలతో డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. నారాయణమ్మ కాలనీలో ఇళ్లముందు ఎనిమిది మీటర్లలోతుగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టడంతో అటుగా వెళ్లే కాలనీవాసులకు దారిలేక ఎవరికి వారు వంతెనలు వేసుకుని ఇళ్లలోకి ప్రవేశిస్తున్నారు. నారాయణమ్మ కాలనీ సమీపంలో స్కూల్ ఉండటంతో అటుగా వెళ్లే విద్యార్థులు ఎప్పుడేప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళనచెందుతున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు, పాలకులు స్పందించి త్వరితగతిన డ్రైనేజీ నిర్మాణం పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతకు కృషిచేయాలి: డీపీఓ


పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డీపీఓ సమత, అధికారులు

గోరంట్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పరిసర ప్రాంతాల శుభ్రతకు కృషి చేయాలని డీపీఓ సమత సూచించారు. పట్టణంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులు పంచాయతీ సిబ్బంది, అధికారులు ర్యాలీ చేశారు. బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం పట్టణంలోని మురికివాడలను డీపీఓ సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి, మాజీ సభ్యులు నాగరాజు, తహసీల్దార్ మారుతి. ఎంపీడీఓ నరేంద్రకుమార్, డిప్యూటీ ఎంపీడీఓ దేవదానం, ఎంఈఓ గోపాల్, డాక్టర్ శృతి పాల్గొన్నారు.

విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించకండి

- డీఎస్పీ నరసింగప్ప


మాట్లాడుతున్న డీఎస్పీ నరసింగప్ప

పెనుకొండ టౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పండుగల సమయంలో విద్వేశాలు రెచ్చగొట్టేలా వ్యవహరించవద్దని డీఎస్పీ నర్సింగప్ప సూచించారు. ఆర్డీఓ కార్యాలయంలో శనివారం ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ ఆధ్వర్యంలో అన్నిశాఖల అధికారులు, నాయకులతో శాంతికమిటీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పలు సూచనలు చేశారు. ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటుచేసే సమయంలో పొలిటికల్‌గా రెచ్చగొట్టేవిధంగా వ్యవహరించవద్దని, అలాచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ రాఘవన్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు, కమిషనర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణపై శిక్షణ



మాట్లాడుతున్న సీడీపీఓ శాంతలక్ష్మి

గోరంట్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయంలో బాలల పరిరక్షణ, బాల్యవివాహాలపై శనివారం సచివాలయ కమిటీ సభ్యులకు అధికారులు శిక్షణ ఇచ్చారు. బాలల హక్కులు, బాల్యవివాహాలు, లైగింక వేధింపుల చట్టం గురించి సీడీపీఓ శాంతలక్ష్మీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఎంఈఓ గోపాల్ పాల్గొన్నారు.

ర్యాలీ విజయవంతానికి కృతజ్ఞతలు: శిల్ప

పెనుకొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం షిర్డీసాయి గ్లోబల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సును, ర్యాలీని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప అనుపాటి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణం కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే వినియోగించాలన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి

సోమందేపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. కార్యాలయం ఆవరణంలో ఉన్న సమావేశ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సగర, ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రకాశం పంతులు కృషి పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటలక్ష్మీ, కన్వీనర్ వెంకటేశులు, సిద్దలింగప్ప, నీరుగంటి చంద్ర, సూరీ, కిష్టప్ప, బీజేపీ మండల కన్వీనర్ మంజునాథ్, సర్పంచ్ నరసింహులు, శ్రీరాములు, గోరంట్ల మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

అగళి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుబ్బారావు మాట్లాడుతూ ప్రకాశం పంతులు అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ చంద్రశేఖర్‌రావు, సీనియర్ అసిస్టెంట్‌లు గుర్రన్న, సిబ్బంది పాల్గొన్నారు.


అగళిలో నివాళులు అర్పిస్తున్న తహసీల్దార్, సిబ్బంది






అభయ, చందకచర్లలోని ఆలయాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ, అమరాపురంలో శనైశ్చరుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా శ్రావణ శనివారం పూజలు

శ్రావణమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. కోట వేంకటేశ్వరస్వామి, మిట్టబండ, కావలికొండ ఆంజనేయస్వామి ఆలయాలు, అగళి రావుడి , కోడిపల్లి, హెచ్‌డిహళ్లి, రామాపురం ఆంజనేయస్వామి ఆలయాలు, పెనుకొండలోని కాశీవిశ్వేశ్వరస్వామి, ఐముక్తేశ్వరస్వామి, ఘనగిరి సోమేశ్వరస్వామి, లక్ష్మీవెంకటేశ్వరస్వామి, మిట్ట ఆంజనేయస్వామి, ఊరువాకిలి ఆంజనేయస్వామి తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, అర్చనలు, అభిషేకాలను శాస్త్రోక్తంగా చేశారు. స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం చేశారు. అదేవిధంగా హిందూపురంలోని కోటలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం, పేట వెంకటరమణస్వామి, విద్యానగర్‌లోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

- న్యూస్ నెట్‌వర్క్, (ఆంధ్రజ్యోతి)


హిందూపురంలోని కోట ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ


పేట వెంకటరమణస్వామి ఆలయంలో నరసింహస్వామి

పావగడలోని శనైశ్చర ఆలయంలో..




నవగ్రహ పూజలందుకుంటున్న జేష్టాదేవి, శనైశ్చరుడు, ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పావగడ, (ఆంధ్రజ్యోతి): పావగడలోని శనైశ్చర ఆలయంలో భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఉదయం 4 గంటల నుంచి స్వామివారికి తైలాభిషేకం, నవగ్రహపూజ, సీతలాంబకు కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రావణమాసంలో స్వామివారి, శీతలాంబను దర్శించుకుంటే పంచమిశని, సప్తమి శని, అష్టమిశని, ఏలినాటిశని దోషాలు వైతొలుగుతాయని ప్రధాన అర్చకులు కృష్ణాశాస్త్రి తెలిపారు. దాదాపు 30వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఆలయ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, కమిటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ తెలిపారు.

ఘనంగా వెండి పల్లకి ఉత్సవం

జేష్టాదేవి సమేత శనైశ్చరుడిని పట్టణంలో శనిమహాత్మ సర్కిల్‌లో వెండి పల్లకీలో ఊరేగింపు నిర్వహించారు. వేలాది మంది భక్తుల నడుమ శనివారం రాత్రి 7-30కు గోవింద నామస్మరణ మధ్య పల్లకీ ఉత్సవం సాగింది.
అమరాపురం: అమరాపురంలోని బసవనపల్లి శనైశ్చరాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి భక్తులు వెండికిరీటాన్ని వితరణ చేశారు.

ప్రథమ చికిత్సలతోనే సరి

పెనుకొండ, హిందూపురానికి రెఫర్ చేస్తున్న వైద్యులు
మెరుగైన వైద్యసేవలకై మండలవాసుల వినతి


నిరుపయోగంగా ఉన్న క్వార్టర్స్


సోమందేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

సోమందేపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు, మెరుగైన వైద్యసేవలను అందించాలని స్థానికులు కోరుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వచ్చే రోగులు సరైన వైద్య సేవలందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రానికి ఆనుకుని జాతీయ రహదారి వెళ్తుండటంతో తరచూ జరిగే రోడ్డు ప్రమాదాలవల్ల క్షతగాత్రులకు అత్యవసర సేవలు అవసరం ఉంటాయి. సకాలంలో సరైన వైద్య సేవలు అందక ప్రథమ చికిత్సలు తీసుకుని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రి లేదా హిందూపురానికి పంపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రమాదంలో గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉన్నప్పుడు వారిని వేరే ఆసుపత్రికి తరలించేలోపు మృతిచెందే అవకాశాలు లేకపోలేదు. అదేవిధంగా ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈదిశలో ఆసుపత్రిలో కేవలం 4పడకలే ఉండటం, 160ఓపీలు నమోదవుతున్నాయి. ఇక్కడున్న వైద్యులు, సిబ్బంది ఆసుపత్రికి వచ్చేవారికి వైద్య సేవలందిస్తున్నారు. ఆసుపత్రి ఆవరణంలో నిర్మించిన క్వార్టర్స్ మరమ్మతులకు నోచుకోక వృథాగా ఉన్నాయి. నాలుగు క్వార్టర్స్ ఉండగా ఒకదానిలో ఆయుష్‌కేంద్రాన్ని, ఆరోగ్య ఉపకేంద్రాన్ని మరొకదానిలో నిర్వహిస్తున్నారు. అయితే భవనాలు శిథిలావస్థకు చేరుకోగా గత వైసీపీ హయాంలో నాడునేడు పథకం కింద నిధులు మంజూరైనా గుత్తేదారు పనులను అర్ధంతరంగా నిలిపివేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఆసుపత్రిలో ఉన్న వసతులు, మందులు టీకాలపై ఆరోగ్య సిబ్బందిని అడగ్గా ఎవరూ సరైన సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం. ఆసుపత్రి ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న ల్యాబ్ నూతన గురించి అడిగినా చెప్పేనాథుడే కరువయ్యాడు. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ముఖ్య అతిథులుగా విచ్చేసిన వైద్యఆరోగ్యశాఖ మంత్రికి మంత్రి సవిత పెనుకొండ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల పునరుద్ధరణ, వసతుల కల్పన, మెరుగైన వైద్యసేవలను ప్రజలకు అందించేందుకు అవసరమైన నిధులు అందించి ప్రక్షాళన చర్యలు చేపట్టాలని కోరారు. ఆసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న క్వార్టర్స్‌ను, పంచాయతీ కార్యాలయంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాన్ని మరమ్మతులు చేపట్టి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెరుగైన సేవలు అందించేలా పాలకులు, ప్రభుత్వ పెద్దలు దృష్టిసారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సురవరం మృతి పార్టీకి తీరనిలోటు: సీపీఐ

పెనుకొండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకులు సురవరం సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరమని ఆయన మృతి పార్టీకి తీరనిలోటని డివిజన్ కార్యదర్శి శ్రీరాములు పేర్కొన్నారు. శనివారం స్థానిక కృష్ణదేవరాయల కాలనీలో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

విద్యార్థులకు డైరీలు పంపిణీ

పరిగి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బీచిగానిపల్లి, ఊటకూరు పాఠశాలలో మండల కన్వీనర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు డైరీలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలాజీ, జిల్లా యువత కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, శాసనకోట వెంకటేశ్ పాల్గొన్నారు.
పెనుకొండ రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టూరు జడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్‌ఆర్‌ఆర్ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డైరీలు పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం నాగార్జునుడు తెలిపారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేయడంజరిగిందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఈశ్వర్‌ప్రసాద్ మాజీ సర్పంచ్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఏపీఎం బదిలీ

రొద్దం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఐకేపీ కార్యాలయంలో పనిచేస్తున్న ఏపీఎం నారాయణ చిలమత్తూరుకు బదిలీపై వెళ్లారు. శనివారం రొద్దం నుంచి నారాయణ చిలమత్తూరుకు వెళ్లగా గోరంట్ల నుంచి జయచంద్రారెడ్డి రొద్దం ఏపీఎంగా నియమితులయ్యారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రవేశానికి ఈనెల 31వ తేదీ ఆఖరు గడువని, వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కేశవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీకాం కంప్యూటర్ కోర్సుల్లో 60సీట్లు మిగిలిఉన్నాయన్నారు. బీఏ హానర్స్ హిస్టరీ, బీకాంకంప్యూటర్స్ అప్లికేషన్స్, బీకాం హానర్స్ అకౌంటెంట్, బీఎస్సీ హానర్స్ కంప్యూటర్‌సైన్స్, బీఎస్సీ హానర్స్ జువాలజీ, కోర్సుల్లో 40సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో కూడా బోధన సౌకర్యం ఉందన్నారు. విద్యార్థులు ప్రవేశానికి అవసరమైన ధృవీకరణపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9908884806ను సంప్రదించాలన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

మడకశిర టౌన్, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఫోర్డ్ సంస్థ ప్రాజెక్టు మేనేజరు అశ్వత్తనారాయణ హెచ్‌ఐవీ పరీక్షలు ఎక్కడ నిర్వహిస్తారు..? గర్భవతి నుంచి బిడ్డకు రాకుండా మందులు ఉపయోగించి రక్షించుకోవడం ఎలా..? తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఫోర్డ్ ప్రాజెక్టు డైరెక్టర్ బదరీష్, ప్రధానోపాధ్యయులు శకుంతలమ్మ పాల్గొన్నారు.

కుట్టుశిక్షణతో ఆర్థిక భరోసా

- మున్సిపల్ చైర్మన్ రమేష్


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

హిందూపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మహిళలకు కుట్టుశిక్షణ పొందడంతో ఆర్థిక భరోసా పెరుగుతుందని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. శనివారం మోడల్‌కాలనీలో ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కుట్టుశిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలరు అంజలీ, బీజేపీ నాయకులు రమేష్‌రెడ్డి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛపురంగా మారుద్దాం

హిందూపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): హిందూపురాన్ని స్వచ్ఛపురంగా మారుద్దామని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన చైర్మన్ రమేష్, టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంవల్ల చాలా అనర్థాలు ఉన్నాయన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాఘవేంద్ర, అయూబ్, నాయకులు నవీన్, నాగేంద్ర, అన్వర్, మెప్మా అధికారి గంగులయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి

సీనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర్లునాయక్


మాట్లాడుతున్న న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్

హిందూపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఖైదీలు బయటకు వెళ్లాక సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వర్లునాయక్ సూచించారు. శనివారం స్థానిక సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ జైలు నుంచి బయటికి వెళ్లాక ఎలాంటి ఘర్షణలు, కక్షల జోలికి వెళ్లకుండా జీవనం సాగించాలన్నారు. ఎప్పటి నుంచి ఏయే కేసుల్లో జైలులో ఉన్నారని ఆరాతీశారు. ఎవర్కైనా న్యాయవాదులను పెట్టుకునే స్థోమతలేకపోతే న్యాయస్థానం దృష్టికి తీసుకొస్తే అలాంటివారికి ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జైలు అధికారి హనుమన్న, న్యాయవాదులు పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు అందజేయాలి

బహుజన చైతన్య వేదిక


ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న బహుజన చైతన్యవేదిక అధ్యక్షులు

పెనుకొండ టౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్నవారికి పింఛన్‌లను అందజేయాలని, వెరిఫికేషన్ పేరుతో అర్హులను కూడా తొలగించారని ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు బహుజన చైతన్యవేదిక అధ్యక్షుడు శివరామక్రిష్ణ వినతిపత్రం అందించారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బాధితులతో కలిసి వెళ్లి ఆర్డీఓను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ సొమ్మును వారి ఆరోగ్యం కోసం ఖర్చు పెడుతున్నారని, వందశాతం అర్హత ఉన్నవారిని కూడా వెరిఫికేషన్ పేరుతో తొలగించారని అన్నారు. రీవెరిఫికేషన్‌చేసి అర్హులకు న్యాయం చేయాలని కోరారు.

సత్తా చాటిన రాష్ట్ర ప్రగతి విద్యార్థులు

పావగడ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని ముగదాల బెట్ట రాష్ట్రప్రగతి విద్యార్థులు నిడిగల్ మండలస్థాయిలో జరిగినక్రీడా పోటీల్లో ప్రతిభ చాటి తాలూకా స్థాయికి ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌మూర్తి తెలిపారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన ఆటల పోటీలలో వంద, 200మీటర్ల పరుగు పందెంలో ధనలక్ష్మీ మొదటిస్థానం సాధించిందన్నారు. రెండోస్థానంలో రమ్య నిలిచిందని, 1500 మీటర్ల పరుగుపందెంలో నిఖిల్ మూడోస్థానం పొందాడన్నారు. కబడ్డీ పోటీల్లో బాలికలు రెండోస్థానం పొందారని, వారు తాలూకా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు.